# సమర్థ సద్గురు


## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 8

పేజీలు 44

ఏప్రియల్ 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................. ....... పేజీ**


దాశరథీ శతకము ....................................................4

శ్రీబాబూజీ ఉవాచ.................................................. 5

అమ్మమాట................................................................ 8

తత్త్వమసి ..............................................................10

అగస్త్య హృదయం ........................ ...............11

దేవుడే భోజనం పంపిస్తాడు .......................13

మానవసేవయే మాధవ సేవ .....................15

రామాయణంలో స్త్రీ పాత్రలు.......................17

బాబూజీతో అనుభవాలు ..............................19

పునర్జన్మ ........................ ......................... .................21

ప్లవ ........ ...... .. ............................ ................................25

మధురం మధురం మధురం .................28

కైవల్యోపనిషత్ ... ......................................................30

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................33

శ్రీ బాబూజీతో అనుభవాలు ......................34

శ్రీ నృసింహ యోగీంద్రులు .............................37

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ......................... ....................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

**9) దురితలతా లవిత్ర ఖర దూషణ కానన వీతిహొత్ర, భూ**
**భరణకళావిచిత్ర భవ బంధ విమోచన సూత్ర, చారువి**
**స్ఫురదరవింద నేత్ర, ఘన పుణ్యచరిత్ర, వినీలభూరికం**
**ధరసమగాత్ర భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - పాపమనే తీగలకు కొడవలి వంటి వాడవు, ఖరదూషణులనెడి అడవికి అగ్నివంటివాడవు, భూమిని రక్షించుట యందు విచిత్రుడవు, పుట్టుకయను ముడిని విడదీయుటయే విధిగా గలవాడవు, ప్రకాశించు పద్మములవంటి నేత్రములు గలవాడవు, పుణ్యచరిత్రుడవు, మేఘకాంతి వంటి శరీరకాంతి గలవాడవు, దాశరథీ కరుణాపయోనిధీ!




*సృష్టి చక్రంలో నలిగిపోకుండా నిరపాయంగా నిలవాలంటే ఏం చేయాలి?
*మనస్సనే అద్దానికి ఏ కళాయి వేస్తే ఆత్మదర్శనమవుతుంది?
*భగవంతునికి చేసే ముఖ్య ఆరాధనలు ఏవి?
*గురువు సదా తనను చూస్తున్నాడని శిష్యుడు ఎప్పుడు గుర్తిస్తాడు?
*గురువుకు జీవితాన్ని అర్పించడమంటే ఏమిటి?
*సాధకునికి శిరోధార్యమైన మంత్రమేది?
*బాబూజీని దర్శించిన మరుక్షణంలోనే తన మనస్సును పోగొట్టుకున్నదెవరు?
*అంత్యకాలంలో భీష్ముని ముఖస్తుగా భగవన్నామం రావడమెలా సాధ్యమైంది?

***సమాధానాలు లోపలి పేజీలలో...........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

27-10-1980

ఈరోజు ప్రార్థన అయిన తర్వాత శ్రీ బాబూజీ మాట్లాడుతూ నిన్న భీమవరంలో నన్ను కొంతమంది పండితులు కలుసుకొని మాట్లాడారు. ఆ పండితులు మన ఉపన్యాసాలను చదువుతున్నారట. నేను చేసిన ప్రబోధము పండితుల నుండి పామరుల వరకు అందర్నీ రంజింప జేస్తున్నదట. ఈ విధంగా వారు ఏవేవో చెప్పారు. భీమవరం నుంచి నేను రాగానే అదే విషయాన్ని ఆలోచిస్తూ "భగవానుడు ఎంత దయామయుడో కదా! భక్తుల కోసం ఎంత త్యాగం చేస్తున్నాడో అని ఆలోచిస్తూ ఉండిపోయాను" అన్నారు.



ఉపన్యాసాలు చాలా బాగుంటున్నాయని పేపర్‌లో ఉత్తరాలు వస్తున్నాయి అని శ్రీ బాబూజీతో మేము చెప్పాము.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ నాకూ చాలా ఉత్తరాలు వస్తున్నాయి. ఈ రోజు కటక్ నుంచి ఒకాయన "స్వామీ! ఇంత కాలానికి ఆధ్యాత్మిక విషయాలను పామరులకు అర్థమయ్యే విధంగా ఎంతో విపులంగా చక్కని ఉదాహరణలతో తెలియజేస్తున్నారు" అని వ్రాశారు.

అయితే ఒక సందేహాన్ని వెలిబుచ్చారు. సాధనకు ఏమన్నా నియమాలు ఉన్నాయా? నియమాలను ఆచరించకపోతే భగవంతుని సాక్షాత్కారం పొందగలమా? అని వ్రాశారు. ఆయన సందేహాలను నేను నివృత్తి చేస్తాను. మీరు ఆయనకి జవాబు వ్రాయండి.

సాధకునికి అతి ప్రధానమైనది విశ్వాసము. అదే భక్తిని పెంపొందిస్తుంది. ఒక గాజు పలకలో చూస్తే నీ ప్రతిబింబం కనబడుతుందా? కనబడదు. ఆ గాజుపలకకే కళాయివేస్తే దానిలో నీ

ప్రతిబింబం అందంగా కనబడుతుంది. అలాగే మనస్సుకు భక్తి అనే కళాయి వేస్తే ఆత్మదర్శనం అవుతుంది. సాధకుడు ఒక గురువును ఆశ్రయించాలి. ఆయనపై విశ్వాసాన్ని పెంచుకోవాలి. గురుదేవునియందు వినయవిధేయతలు కలిగి ఉండాలి. గురుదేవుని ఎన్నడూ దేహదృష్టితో చూడరాదు.

దుర్యోధనుడు శ్రీకృష్ణ పరమాత్ముని సహాయం అర్థించటానికి వెళ్ళినప్పుడు ఆయనను చూసి నిదురిస్తున్నాడు అనుకుంటాడు. అనేక నీచభావాలతో, సంకల్పాలతో కృష్ణ పరమాత్ముని దర్శిస్తాడు. అది దుర్యోధనుని సంస్కారహీనత.

పరమాత్ముడు నిదురిస్తాడా! ఒకక్షణం నిదురిస్తే జగత్తు స్తంభించిపోతుంది. పరమాత్మునికి గుణాలుంటాయా? ఆయన గుణరహితుడు. అయితే సగుణస్వరూపుడిగా కనిపించినపుడు మనము ఆయనను ఆ విధంగా భావిస్తాం.

అద్దంలో మనం ఏ రకంగా చూస్తే అదే కనబడుతుంది. మన ముఖముపై మచ్చ ఉంటే అదే ప్రతిబింబిస్తుంది. ఆ మచ్చని ముఖముపై తొలగించాలిగాని, అద్దం ఎంత తుడిచినా పోదు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనబడుతుంది.

కాబట్టి భక్తిని, విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. అలాచేస్తే మనలోని సంకల్పాలు, దుష్టశక్తులు వాటంతట అవే హరింపబడతాయి. కొబ్బరిచెట్టు ఆకులు రాలినకొద్దీ ఎదుగుతుంది. 24 ఆకులు రాలేటప్పటికి ఫలాన్ని కూడా యిస్తుంది. రాలిపోయిన ఆకులన్నీ సంకల్పాలు.

మానవుడు పేకాట, త్రాగుడు, సిగరెట్టు మొదలగు దురలవాట్లు అన్నీ ఉన్నప్పుడు స్నేహితులు వారినే ఆశ్రయిస్తారు. అట్టి మానవుడే ఆ దురభ్యాసాలన్నీ మాని భక్తిమార్గంలో నడుస్తుంటే, అతన్ని స్నేహితులే, వీడికి పిచ్చెక్కిందని హేళన చేస్తారు. అప్పుడే వారికి సరియైన సమాధానం చెప్పాలి.

ఇటువంటి పిచ్చిపట్టిన శివాజి, అక్బరు, తానీషా మొదలైన వారికి ఏమైంది? భక్తి అనే పిచ్చి పడితే తప్పక తరిస్తారు. అదే కావల్సింది. నా శిష్యులలో ఒకడు మరణించాడు. గురుద్రోహం చేశాడు. కాబట్టి పాపకర్మ

అనుభవించాడు. అతనిని అతని మిత్రులు వేరొక గురువు దగ్గరకు తీసుకువెళ్ళారు. అక్కడ ధనాన్ని పోగొట్టుకున్నాడు. అక్కడనుంచి తిరిగి వచ్చేశాడు. వచ్చేటప్పుడు దెబ్బ తగిలింది. ఆ గాయము వలన ధనుర్వాతం వచ్చి మరణించాడు. అది కేవలం ఒక కారణం మాత్రమే. అలా జరగవలసి ఉంది, జరిగింది. విధి నిర్ణయాన్ని ఎవరు తప్పించగలరు? చిన్నప్పటినుండి ఆ వ్యక్తిని ఎంతో ఆదరించాను. కాని అతను చేసుకున్న కర్మను ఎవరు తప్పించగలరు? గురుద్రోహం చేసిన వాడిని భగవంతుడు కూడా రక్షించడు. తనుపోయేముందు నవరాత్రి ఉత్సవాలకు వచ్చి నాకు నమస్కరించాడు. అమ్మ గదిముందు కూర్చొని ఏడ్చాడు. ఆఖరి క్షణంలో చనిపోయేముందు నా దగ్గరికి తీసుకెళ్ళమని అతని మిత్రులని, బంధువులని ఎంతో ప్రాధేయపడ్డాడు. కాని వారు తిరస్కరించారు. ఆ వ్యక్తి మాత్రం అదే ఆవేదనతో ప్రాణం వదిలాడు" అన్నారు శ్రీ బాబూజీ.

విఠల్ చరణదాస్ మాట్లాడుతూ 'అదే అతనిని రక్షిస్తుంది' అన్నాడు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'నీ మనస్సు వక్రించినప్పుడే నా మనస్సు బాధపడ్తుంది' అన్నారు.

చరణ్‌దాస్ మాట్లాడుతూ 'మీకు మనస్సు లేనప్పుడు మనోవేదన ఏమిటి? అన్నాడు.

"అందరి మనస్సులు వేదన చెందితే అది నేను చెందినట్లే గదా! మీ అందరిలో ఉండి, మీ అందరిని ప్రకాశింపజేసేది నేనే అని మీరు భావించినప్పుడు మరి మనోవేదన చెందేది ఎవరు? మీరే నిర్ణయించండి. మీరు అంతటి ఉన్నత భావాలతో మాట్లాడేటపుడు ఇది మీరే నిర్ణయించాలి" అన్నారు శ్రీ బాబు.

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## మనస్సు నిశ్చలం - మాట నిర్మలం

ఈ రోజు భీష్మఏకాదశి. మన పెద నింద్రకొలనులో శ్రీ భక్త సహిత సద్గురు దేవుల యొక్క దివ్యమూర్తి ప్రతిష్ఠ జరిగిన పుణ్యదినము. సూర్య గమనాన్నిబట్టి కాలాన్ని నిర్ణయించారు మహాత్ములు. మహాత్ములు మనకు కేవలం దేవుడిని గురించి మాత్రమే చెప్పలేదు. వారు వారి దివ్యబోధల ద్వారా మనలోనే వున్న భగవంతుడిని గుర్తించలేక పోతున్న మన ప్రవృత్తులలో మార్పు తెచ్చి, మనలోపల వున్న దేవుడనే అనంతశక్తిని గుర్తింపజేస్తున్నారు మహాత్ములు.



అట్టి మహానుభావులకి ఒక దేవాలయం నిర్మించాలనే దృఢ సంకల్పం శ్రీ వీర్రాజు గారికి కలిగింది. అంతేకాకుండా, ఈ ఊరికి శ్రీబాబూజీమహరాజ్ వారు సాక్షాత్ విష్ణుస్వరూపమేనని ఢంకా మీద దెబ్బకొట్టి చెప్పి, స్వామి వారి దివ్యత్వాన్ని గుర్తింపచేసిన మహానుభావులైన శ్రీ నింద్రకొలను డాక్టరుగారు (కొప్పెర్ల వెంకటరాజుగారు)యొక్క విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠ చేయాలని సంకల్పించారు. 'భక్తుల చరిత్ర చదువుకోండి, భక్తుల చరిత్ర ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చు' అని శ్రీబాబూజీ బోధ.

భక్తుడు సర్వకాల సర్వావస్థలయందు తన దైవ స్వరూపాన్నే ధ్యానిస్తూ, ఆయన యందే లీనమైపోతాడు. 'భక్తి యొక్క పరాకాష్టయే జ్ఞానం; జ్ఞానం యొక్క పరాకాష్ఠయే మోక్షం' అన్న శ్రీగురుదేవుల బోధ అనుసరించి, ఇక్కడ ఇప్పుడు భక్తుడు వేరు, భగవంతుడు వేరుగా ఎక్కడ వున్నారు. అందుకనే ఈ మన నింద్రకొలను కాశీవనాశ్రమ శాఖలో, **భక్త సహిత సద్గురు దేవుల** మూర్తి ప్రతిష్ఠ మరొక మహావిష్ణు భక్తుడైన భీష్ముని సంస్మరించుకునే భీష్మ ఏకాదశి నాడు జరుపుకోవడమైనది.

అంత్యకాలంలో ఎవరు ఏ వాసనలతో వుంటే వారికవే గుర్తుకు వస్తాయి అన్నట్లు పరమ భాగవతాగ్రేశ్వరుడైన భీష్మపితామహుడి

ముఖస్తుగా, (ఘోరాతిఘోరమైన కురుక్షేత్ర యుద్ధం జరుగుతుండగా, ఆయన ఒళ్ళంతా బాణాలతో తూట్లుపడి వుండి, అంపశయ్యపై పడుకుని వుండగా) శ్రీ విష్ణు సహస్ర నామాలు వెలువడ్డాయి. ఇంగువ కట్టిన గుడ్డకి ఇంగువ వాసనే అబ్బినట్లు, నిరంతరం భగవన్నామాన్ని స్మరించే భీష్ముని ముఖస్తుగా అదే వస్తుంది. ఆయన అంపశయ్య మీద పడుకుని వున్నా ఏమాత్రం చలించలేదు. ఆయన మనస్సు, దృష్టి నిశ్చలంగా భగవంతుని యందు నిలబెట్టగలిగాడు. ఆ నిశ్చల మనస్సు ద్వారా నిర్మలమైన వాక్కులే వెలువడ్డాయి. అందుకే భగవంతుడు కృష్ణ స్వరూపంతో ఆయనకు దర్శనమిచ్చి, ఆయనకు పరిపూర్ణంగా సంశయ నాశనం చేశాడు. భీష్ముని యొక్క నిశ్చల మనస్సు ద్వారా సర్వుల యొక్క మనో మాలిన్యాన్ని పోగొట్టే నిర్మలమైన విష్ణు సహస్రనామాలు వెలువడ్డాయి.

అంతటి పుణ్యాత్ముడైన భీష్ముడెందుకు అంపశయ్యపై పడుకో వలసి వచ్చింది? తాను ధర్మపరుడై వుండి కూడా, అధర్మపరుడు, నీచుడు అయిన దుర్యోధనుని పక్షాన వుండి, వాడు పెట్టిన అన్నం తినడం వలన తన రక్తం కలుషితమైనదని భావించాడు భీష్ముడు. ఈనాడు అర్జునుడి బాణాల వలన తనలోని చెడురక్తమంతా బయటకు వెళ్ళిపోయిందని ఆనందపడుతూ ఆయన అంపశయ్యను ఆశ్రయించాడు. ఆయన శరీరం వున్నప్పుడే శరీర దృష్టి లేనివాడు. ఆజన్మ బ్రహ్మచారి. నిరంతరం పరబ్రహ్మ యందే మనస్సును నిలిపినవాడు. కృష్ణుని ఆజ్ఞ అనుగ్రహం వలన అర్జునుడు పాతాళగంగను రప్పించి, భీష్ముని దాహం తీర్చాడు. అది కృష్ణభగవానుడు అందించిన జ్ఞానగంగ. **భక్తానాం హృదయాంభోజే విశేషేణ ప్రకాశతే!**

మన గురుదేవులు మనకు ఒక నామాన్ని అందించారు. విషయాదులపై మనస్సును పోనీయక, మనస్సును నిరంతరం ఆ నామం మీదనే నిలబెట్టాలి. అప్పుడే శ్రీ గురునారాయణుని కృపను పొంద గలుగుతాము. శ్రీ గురునారాయణుడు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ ఆయురారోగ్య ఐశ్వర్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి మనందరినీ సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# తత్త్వమసి

- సుషుమ్నా ప్రసాద

తత్త్వమసి అనేది వేదాంత మహావాక్యములందు ప్రశస్తమైనది. తత్త్వమసి అనే పదానికి అర్థం 'తత్' అది, 'త్వం' నీవు, 'అసి' అయి వున్నావు. అంటే నీవు దేహానివి కాదు, ఆ పరమాత్మవై వున్నావు అనే అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. ఇది అనుభవ వాక్యము.

అరుణి అనే మహర్షి ఉత్తమ వంశంలో జన్మించి, ఆత్మసాక్షాత్కారమును పొందిన మహనీయుడు. ఆయనకు 'ఉద్దాలకుడు' అనే పేరు కూడా వున్నది. ఆ ఋషి పుంగవుడు ఒక గొప్ప కులపతి. అతనికి శ్వేతకేతుడు అనే ఒక పుత్రుడు వున్నాడు. ప్రతి తండ్రి సహజంగా తన కుమారుడు తన కంటే శ్రేష్ఠుడు, వంశ ప్రతిష్ఠ ఇనుమడింప జేసేవాడు కావాలని కోరుకుంటారు. అలాగే ఉద్ధాలకుడు కూడా అభిలషించాడు. కానీ తన పుత్రుడిలో 12సంవత్సరాలు నిండినా తాను ఆశించిన లక్షణాలు కనబడనందున బాధపడుతూ తన కుమారుడిని విద్యాధికునిగా, జ్ఞానిగా చూడాలని ఆశించాడు.

ఒకరోజు శ్వేతకేతుని పిలిచి, 'నాయనా! నీవు బ్రహ్మచర్యాన్ని చేపట్టి, గురుమూర్తిని ఆశ్రయించి, సకలవిద్యా పారంగతుడవు, ఆత్మజ్ఞానివి కావాలని నా అభిమతం' అన్నాడు.

ఆత్మాభిమానియైన శ్వేతకేతు ఆ మాటలు శూలంతో పొడిచినట్లుగా భావించి వెంటనే తాను విద్యాభ్యాసం చేయాలని సంకల్పించాడు. ప్రాతఃకాలంలో లేచి తల్లిదండ్రులకు నమస్కరించి, ప్రాచీనశీలుడనే గురుమూర్తి వద్దకు వెళ్ళి పన్నెండు సంవత్సరాలు బ్రహ్మచర్యంతో వేదాధ్యయనం చేసి, సకల విద్యాపారంగతుడయ్యాడు. గురుమూర్తికి నమస్కరించి, గురువాజ్ఞ స్వీకరించి, గృహోన్ముఖు డయ్యాడు. విద్యావంతుడైన కుమారుడిని చూసి తండ్రి చాలా సంతోషించాడు.

- సశేషం

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

**దైవతైశ్చ సమాగమ్య ద్రష్టుమభ్యాగతో రణమ్ ।**
**ఉపాగమ్యాబ్రవీత్ రామం అగస్త్యో భగవాన్ ఋషిః ॥**

తాత్పర్యము - దేవతలతో కూడి రణాన్ని వీక్షించడానికి వచ్చిన భగవాన్ అగస్త్యులు శ్రీరాముని సమీపించి ఇలా పలికారు.

పైకి సాధారణంగా అగస్త్యుల ఆగమనాన్ని గురించి వివరిస్తున్నట్లు వున్న ఈ శ్లోకాన్ని లోతుగా పరిశీలిస్తే గురువు తన శిష్యులను నిరంతరమూ ఎలా కాచి వుంటారన్నది అర్థమవుతుంది. యుద్ధాన్ని వీక్షించడానికి అగస్త్యులు వచ్చిన్నట్లయితే రావణవధ వరకూ వేచి వుండేవారు. కానీ, ఆదిత్యహృదయ ఉపదేశానంతరమే ఆయన రణ రంగము వీడి వెళ్ళిపోయారని చెప్పబడింది. ఆయనను అనుసరించి వచ్చిన దేవతలు చివర వరకూ వుండి జయజయ ధ్వానాలు పలికారు.

పరమేశ్వరుని ప్రత్యక్షరూపమైన గురుభగవానుని అనుసరించి దేవతలు రావడంలో ఆశ్చర్యం లేదు. గజేంద్ర మోక్షం ఘట్టంలో శ్రీ మహా విష్ణువుతో పాటుగా ఆయన పరివారం కూడా వున్న పళంగా వచ్చిన సన్నివేశాన్ని ఈ ఘట్టం గుర్తుచేస్తుంది. అయితే గజేంద్రుడు ఎలుగెత్తి పిలిచి శరణాగతి కోరనంతవరకూ శ్రీమన్నారాయణుడు కూడా కదల లేదు. ఇక్కడ శ్రీరాముడు తన గురువైన అగస్త్యులను పిలిచినట్లుగా చెప్పబడలేదు. ఇది గురువు తన శిష్యుని నిరంతరమూ రక్షించడానికి పడే ఆర్తిని సూచిస్తోంది.

ఈ విషయాన్ని వివరిస్తూ శ్రీబాబూజీ 'గురువు తన దృష్టిని ఎల్లప్పుడూ శిష్యుల వైపు ప్రసరిస్తూ వుంటాడనీ, దానిని శిష్యుడు తన దృష్టిని గురువు వైపు మరల్చినప్పుడు మాత్రమే గుర్తించగలడ'నీ తెలిపారు. దానినే **మనం చూపులోన చూపు నిలిపి స్వామి రక్ష యొసగునే** - అని పాడుకుంటాము. శ్రీబాబు తమ బోధ సమయంలో ఎంతోమందిని లేపి, 'నేను ఆ సమయంలో నీ జేబులోనే వున్నాను. ఒక్కసారైనా మరి నన్ను స్మరించావా?' అని ప్రశ్నిస్తూ గురునామ స్మరణను సాధకుడు ఎన్నడూ మరువరాదని తెలిపేవారు.

మరి శ్రీరాముడు అగస్త్యులవారిని స్మరించినట్లు వున్నదా అని పరిశీలిద్దాం. మొదటి శ్లోకంలో **చింతయాస్థితమ్** అన్న విషయాన్ని

వ్యాఖ్యానిస్తూ చాలామంది శ్రీరాముడు భీకరమైన పోరులో (**పరిశ్రాన్తం**) అలసట చెంది, తిరిగి యుద్ధరంగంలో ప్రవేశించిన రావణుడిని చూసి చింతితుడై వున్నట్లు రచించారు. నిశితంగా పరిశీలిస్తే **చిన్తయా** అంటే ఆలోచన లేదా స్మరణలో **స్థితం** అన్న ప్రయోగం యుద్ధరంగములోనే నిలబడి తన గురుదేవుని స్మరిస్తున్న శ్రీరామచంద్రుని సూచిస్తుంది.

మరి సాధకులందరికీ జగద్గురువులైన శ్రీకృష్ణుని ఆదేశం కూడా అదే కదా! కృష్ణపరమాత్మ **సర్వేషు కాలేషు మాం అనుస్మర యుధ్యచ** అంటే అన్ని వేళలా, అంతఃశత్రు, బాహ్యశత్రువులతో యుద్ధం సలుపుతున్న సమయంలో సైతం నన్నే స్మరించు అని శెలవిచ్చారు. అంతటితో ఆగక 'నన్నెవరైతే అనన్యమైన చింతనతో స్మరిస్తూ వుంటారో, వారి యోగక్షేమాలన్నీ నేనే వహిస్తాను' **అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం** అని అభయమిచ్చారు.

తన స్మరణలో వున్న శ్రీరాముని చెంతకు వడివడిగా వచ్చిన అగస్త్యుల రాకని ఆ అభయమునకు నిదర్శనముగా భావించవచ్చు. అంతేకాక, ఈ శ్లోకంలో అజ్ఞానమనే చీకటిని తొలగించే గురుపరబ్రహ్మను తెలిపే **భగ** ప్రకాశముతో కూడి అన్న శబ్దాన్ని ప్రయోగిస్తూ **భగవాన్ ఋషి** అని సంబోధించారు. అది ప్రత్యక్షమైన భగవంతుడికి, ప్రత్యక్ష రూపమైన గురుమూర్తినే కాక వెలుగులను కురిపించే ఆదిత్యుడను కూడా వర్ణిస్తుంది.

**అబ్రవీత్ రామం** అంటూ అగస్త్యులవారే శ్రీరాముని సమీపించి మాట్లాడినట్లు చెప్పబడింది. నిజానికి గురువులు శబ్దాతీతులై అనిర్వచనీయమైన ఆత్మానందంలో నిరంతరమూ మునిగి వుంటారు. ఎంతో అత్యవసరమైనప్పుడు తప్ప మాటలతో శబ్ద ప్రయోగం చెయ్యరు. శ్రీ బాబూజీ విషయంలో ఇది అందరికీ అనుభవమే. సనకసనందనాది మహామునులైన శిష్యులకు దక్షిణామూర్తి స్వరూపులైన గురుదేవులు **మౌనవ్యాఖ్య** తోనే జ్ఞానాన్ని అందించారు. మరి సాధారణమైన శిష్యవర్గానికి జ్ఞానబోధ చెయ్యడానికి గురువులు ఎంతో క్రిందికి దిగివచ్చి మాట్లాడతారు. అందుకే **మంత్రమూలం గురోర్వాక్యం** అని చెప్పబడింది. గురువు ముఖస్తుగా వచ్చిన ప్రతిపదమునూ సాధకులు శిరోధార్యమైన మంత్రముగానే భావించాలి. ఆ విధంగా అగస్త్యులు శ్రీరామచంద్రునితో పలికిన పలుకులే ఆదిత్యహృదయంగా జగత్తుకి ఉపదేశమంత్రమయింది.

- సశేషం

# దేవుడే భోజనం పంపిస్తాడు

స్వామి వివేకానంద జీవితంలో జరిగిన ఒక అపూర్వ సంఘటన.......

ఒకసారి స్వామి వివేకానంద మండు వేసవిలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఒక రైల్వే స్టేషన్‌లో వుండగా ఒక సంఘటన చోటుచేసుకుంది. వివేకానంద సన్యసించారు కనుక వారికి భగవత్ ప్రసాదంగా లభించినదే భుజిస్తూ వుండేవారు. భిక్షగా ముడిసరుకు లభిస్తే దాన్ని వండుకుని తినేవారు. లేదా భిక్షాటన చేస్తూ వుండేవారు.

ఒకనాడు స్వామికి తినడానికి ఏమీ దొరకలేదు. ఆయన వద్ద చిల్లిగవ్వ కూడా లేదు. ఆకలి, దాహార్తి, బడలికతో నేలపై కూర్చున్న స్వామీజీని గమనించి ఒక ధనవంతుడు చులకనగా మాట్లాడ నారంభించాడు. అతని ఆలోచన ప్రకారం సన్యాసులు అంటే ఏ పనీ చేయకుండా సోమరిలాగా తిరుగుతూ, ఊళ్ళో వారిమీద భోజనానికై ఆధారపడుతూ, ప్రజలను మభ్యపెట్టి ధనం అపహరిస్తూ వుంటారనే భావనతో స్వామీజీతో ఇలా అన్నాడు. 'స్వామీ! చూడు చూడు నేనెంత మంచి భోజనం చేస్తున్నానో! నా వద్ద త్రాగటానికి చల్లని నీరు కూడా వుంది. నేను డబ్బులు సంపాదిస్తాను కాబట్టి నాకు మంచి మంచి వంటకాలు, వగైరాలు సమకూరాయి. ఇటువంటి భోజనం నువ్వు కనీసం కలలో అయినా పొందగలవా? ఏ సంపాదనా లేకుండా దేవుడు దేవుడు అంటూ తిరిగేవాడివి. అందుకే నీకు ఈ బాధలు. అయినా నువ్వు నమ్ముకున్న దేవుడు నీకేమిచ్చాడయ్యా? ఆకలి, బడలిక తప్ప' అంటూ దెప్పిపొడవటం మొదలు పెట్టాడు. స్వామీజీ ముఖంలో ఒక్క కండరం కూడా కదలలేదు. విగ్రహంలా కూర్చుని భగవంతుని స్మరిస్తున్నారు.

అప్పుడు ఒక అద్భుతం జరిగింది .................

ప్రక్క ఊరి జమిందారు ఒకరు స్వామీజీని వెతుక్కుంటూ వచ్చి, ఆయన పాదాలపై వ్రాలిపోయాడు. అతను స్వామితో ఇలా అన్నాడు 'మీ పాదాలను స్పృశించి సేవించే భాగ్యం కలగడం నా పట్ల శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహం. దయచేసి ఈ భోజనాన్ని స్వీకరించండి' అని ప్రాధేయపడ్డాడు.

'ఎవరు నాయనా నువ్వు? నేనెరుగనే నిన్ను. పొరబడుతున్నట్లున్నావు. నీవు వెతుకుతున్న వ్యక్తిని నేను కాదు' అని అంటుంటే, ఆ వ్యక్తి స్వామీజీ ముందు వెండి పీట వేసి, తాను తెచ్చిన భోజనాన్ని ఒక బంగారు అరిటాకు మీదకు మారుస్తూ... 'లేదు స్వామీ! నేను కలలో చూసినది మిమ్మల్నే. శ్రీరామచంద్రమూర్తి నాకు స్వయంగా కలలో దర్శనమిచ్చి, నాకు మిమ్మల్ని చూపిస్తూ నా బిడ్డ ఆకలితో అలమటిస్తుంటే, నువ్వు హాయిగా తిని నిద్రిస్తున్నావా! లే లేచి అతనికి భోజనం పెట్టు అని ఆజ్ఞాపించారు. ఆహా! ఏమి భాగ్యం! మీ వలన నాకు రామ దర్శనం కలిగింది. తండ్రీ బిడ్డలిద్దరిదీ ఏమి గాంభీర్యం! ఏమి సౌందర్యం! ఒక్కసారి చూస్తే చాలు ఎవరూ మరచిపోలేరు. నేను పొరబడటం లేదు స్వామీ. దయచేసి వేడి చల్లారక ముందే ఆరగించండి. చల్లని నీరు కూడా తెచ్చాను' అన్నాడా వ్యక్తి.

స్వామీజీ కన్నుల వెంట నీరు జల జలా కారింది. ఏ అభయహస్తమయితే తన జీవితమంతా కాపాడుతూ వస్తుందో, అదే అభయహస్తమిది.

ఎదురుగా నోరు వెళ్ళబెట్టి ఇదంతా చూస్తున్న ఆ ధనవంతుడు ఉన్న పళంగా స్వామివారి పాదాలపై పడి, కన్నీటి ధారలతో స్వామి పాదాలను అభిషేకిస్తూ క్షమాపణ కోరాడు. సన్న్యాస జీవితమంటే భగవంతుని ఒడిలో జీవించడమని అర్థం అయింది. నిజమైన సన్యాసిని దూషించడమంటే భగవంతుని దూషించడమేనని తెలుసుకున్నాడు.

తనని నమ్ముకున్నవారిని ఎప్పుడూ కంటికి రెప్పలాగా కాపాడుతూ వుంటాడు భగవంతుడు. యోగుల హృదయాలలో సదా నివసిస్తూ వుంటాడు ఆ పరమాత్ముడు.

ఇది కేవలం స్వామీజీ జీవితంలో జరిగిన ఒక చిన్న సంఘటన మాత్రమే. ఇంతకు మించినవి, ఎంతో ఆశ్చర్యం కలుగజేసేవి, భగవంతుని పట్ల, యోగుల పట్ల సడలని విశ్వాసం కలుగజేసేవి మరెన్నో!!

# మానవ సేవయే మాధవ సేవ

(గత సంచిక తరువాయి) - ఎన్. కుట్టీ

అప్పుడు మాధవుడు 'గిరిధరా! మనం ఇలాంటి పరిస్థితుల్లో ఈమెను విడిచి వెళ్ళడం మంచిది కాదు. ఇప్పుడే మనం తోడు వుండాలి. మనం వీలైనంత సేవ చేసి, రెండు మూడు రోజుల్లో ఆమెకు తగ్గగానే కాశీకి బయలుదేరుదాం' అన్నాడు.

అప్పుడు గిరిధరుడు 'మాధవా! మనతో వచ్చిన వాళ్ళందరూ వెళ్ళిపోయారు. ఈపాటికి వారందరూ తిరుగు ప్రయాణంలో వుండవచ్చు. మనం వెడదాం' అన్నాడు. కాని, మాధవుడు గిరిధరుడితో 'మనం ఇప్పుడు ఈ అవ్వను విడిచి వెళ్ళడం భావ్యం కాదు. తగ్గిన తరువాత వెడదాం' అన్నాడు. గిరిధరుడు మాధవుడితో 'కావాలంటే నువ్వు ఇక్కడే వుండి, అవ్వకు జ్వరం తగ్గిన తరువాత కాశీకి రా. నేను మాత్రం వెడుతున్నాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఇక్కడ నాలుగు రోజుల తరువాత ఆ ముసలి అవ్వకు జ్వరం తగ్గింది. మాధవుడు జ్వరం తగ్గేవరకు ఆమెకు సేవ చేశాడు. కాశీవిశ్వేశ్వరుడు మాధవుడు అవ్వకు చేసిన సేవకు ఎంతో సంతోషించాడు. ఆ అవ్వ రూపంలో విశ్వేశ్వరుడే వచ్చి పరీక్ష పెట్టాడు. ఆ విశ్వేశ్వరుడు మాధవునికి దర్శనమిచ్చి, 'నాయనా! నీ సేవ మరువ లేనిది. ఆపత్కాలంలో కష్టంలో వున్నవారికి సేవచేస్తే సాక్షాత్తు ఆ భగవంతునికి చేసినట్లే. నేను మీకు పరీక్ష పెట్టాను. నీవు పరీక్షలో నెగ్గావు. అందువలననే నేను నీకు సునాయాసంగా కనపించాను. నీ స్నేహితుడు కూడా మంచి భక్తుడే. కాశీకి వెళ్ళడానికి చాలా కష్టపడుతున్నాడు. త్వరలో వస్తాడు చూడు. నువ్వు ఇహ కాశీకి వెళ్ళనవసరం లేదు. నీవు నన్ను ఇక్కడే దర్శించావు' అన్నాడు.

ఇహ అక్కడ గిరిధరుడు అలా నడిచి వెడుతూ నడవలేక, తిండిలేక, జ్వరంతో బాధ పడుతూ, మధ్య దారిలో పడి ఏడుస్తూ, ఎవరైనా వచ్చి తనను రక్షిస్తారేమో అని ఎదురు చూస్తూ, 'ఓ కాశీవిశ్వేశ్వరా! నేను నీ గురించే శ్రమపడి వస్తున్నానే! నా కేమిటీ పరీక్ష! ఇప్పుడు నాకు అనుభవంలోకి వస్తోంది. నేను చేసినవన్నీ తప్పులే! ఆ ముసలి అవ్వ ఓపిక లేకపోయినా ఆ రోజు రాత్రి దిక్కుతోచని స్థితిలో వున్న మమ్మల్ని చేరదీసి, ఆదరించి, ఇంత అన్నం పెట్టి, పడుకోవడానికి

ఇంత స్థల మిచ్చి మమ్మల్ని ఆదుకున్నది. ఆమెకు జ్వరం వస్తే అలాంటి స్థితిలో ఆవిడను ఒక్కతినే వదిలివేసి మాధవుడు చెప్పినా వినకుండా వచ్చేశాను. నాకు ఈ శాస్తి జరగవలసినదే. అసలే ముసలి ఆవిడ. ఎవరూ తోడు లేరు. అందులో జ్వరతీవ్రత. ఇవన్నీ ఆలోచించకుండా కాశీకి వెళ్ళాలనే తొందరలో తప్పుచేసి బయలుదేరి వచ్చాను. నన్ను ఇప్పుడు రక్షించేవారు ఎవరు స్వామీ? కాశీనాథా! నన్ను రక్షించు! నేను ఇక్కడే నా ప్రాణాలు వదులుతాను' అని పరిపరి విధాల మొర పెట్టుకున్నాడు.

గిరిధరుడు కూడా కష్టాలకు ఓర్చి కాశీకి బయలుదేరాడు. భగవంతుడు రక్షించకుండా వుంటాడా? వారి ఊరివాళ్ళు తిరుగు ప్రయాణంలో దారిలో అపస్మారక స్థితిలో పడివున్న గిరిధరుడిని చూసి, అతనికి సేవ చేసి, అతనిని తీసుకుని వారి ఊరికి ప్రయాణం అయ్యారు. మధ్యలో మాధవుడు కనిపించేసరికి వాళ్ళు గిరిధరుడిని అక్కడ వదలి వెళ్ళి పోయారు.

గిరిధరుడు అవ్వతో 'అవ్వా! నీకు అంత జ్వరం వుంటే, మాకు అంత ఆతిథ్యమిచ్చినాగాని కనికరం లేకుండా అట్టి స్థితిలో నిన్ను వదలి నేను వెళ్ళిపోయాను. నాకు ఆ భగవంతుడు సరియైన శాస్తి చేశాడు. నాకు అలా కావలసినదే. అవ్వా! నేను జ్వరంతో బాధపడుతూ వుంటే ఆ కాశీవిశ్వేశ్వరుడే మా ఊరివాళ్ళ రూపంలో వచ్చి నన్ను తీసుకు వచ్చారు. కానీ, ఇంత కష్టపడి నేను కాశీవిశ్వేశ్వరుణ్ణి చూడలేకపోయాను. మాధవుడు కాశీకి రాకుండా మీకు సేవ చేసి, సాక్షాత్ ఆ మాధవుడికే సేవ చేసినట్లుగా భావించాడు' అని చెబుతూ ఏడుస్తూ వుంటే అవ్వ రూపంలో వున్న కాశీవిశ్వేశ్వరుడు దర్శనమిచ్చి 'గిరిధరా! నీవు కూడా మంచి భక్తుడవే. నా కోసం ఎన్నో కష్టాలకోర్చి కాశీకి బయలుదేరావు. ఒక మనిషి ఆపదలో వున్నప్పుడు అలా వదలి వెళ్ళినందుకే ఎన్నో బాధలు పడ్డావు. అదే మాధవుడు ఇక్కడ వుండి నాకు సేవ చేసి, ఏ కష్టం పడకుండా నన్ను దర్శించుకున్నాడు. అది నీవు చేయలేకపోయావు. కానీ చేసిన తప్పుకు ఎన్నో కష్టాలు అనుభవించావు. నీ పూర్వజన్మ సుకృతం వల్ల నన్ను దర్శించుకోగలిగావు. మీ ఇద్దరికీ పరీక్ష పెట్టాను. ఈ పరీక్షలో మాధవుడు గెలిచాడు. నీవు పూర్వజన్మ సుకృతం వలన నన్ను దర్శించగలిగావు! మానవసేవయే మాధవసేవ!!' అని చెప్పాడు.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషమ్నా ప్రసాద

(గత సంచిక తరువాయి)

## సీత

ఆ సమయాన్ని అదునుగా చూసుకుని, కాచుకుకూర్చుని, గుంటనక్కలాగ అవకాశమునకు వేచి యున్న దశకంఠుడు యతి రూపంలో భిక్షకు వచ్చాడు. జానకి గృహలక్ష్మి ధర్మాన్ని అనుసరించి యతికి భిక్ష వేయడానికి వచ్చింది. తాను లక్ష్మణరేఖను దాటనని, యతినే రేఖను దాటి వచ్చి భిక్షను స్వీకరించమన్నది. గీత దాటితే భస్మమైపోతానని తెలిసిన లంకేశ్వరుడు జానకితో 'అలా రావడం నా ధర్మానికి విరుద్ధం. యతికి ఆతిథ్యమివ్వడం గృహలక్ష్మి విద్యుక్త ధర్మం' అని చెప్పి ఆమెను ఒప్పించాడు.

విధిలేక లక్ష్మణ రేఖను దాటి సీతమ్మ భిక్షవేయడానికి బయటకు రావడం, రావణాసురుడు సీతను అపహరించడం ఒక తృటిలో జరిగిపోయాయి! నిస్సహా స్థితిలో రావణుని వాహనంలో నిర్బంధింపబడిన సీతాదేవి రోదనము అరణ్యరోదనవే అయింది. అరణ్యకాండ ముగుస్తోంది. 10సంవత్సరాలు అరణ్యంలో రాముని సన్నిధిలో పరమానందాన్ని పొందింది. ఆపైన కిష్కింధకాండము. కిష్కింధకాండలో మనం సీతమ్మను పరోక్షంగానే దర్శించాలి.

**సుందర కాండ** - దివ్యసౌందర్యంతో విరాజిల్లే సీతామహాదేవి స్వర్ణ లంకా ప్రవేశం ఆమెకు ఆనందదాయకం కాదు. అంధకార బంధురం! అశోకవన ప్రవేశం ఆమె పాలిట శోకవన ప్రవేశమే! పతివిరహంతో పరితపిస్తున్న పావని సీత స్వర్ణ లంకలోని సోయగాన్ని, రత్నఖచిత భవనాలను, భోగ భాగ్యాలను ఆమె తృణప్రాయంగా భావించింది. అవన్నీ అమెకు జుగుప్సాకరంగా గోచరించాయి. సౌందర్యానికి, సంపదకు బాహ్యాడంబరాలు కొలమానం కాదని, ఆత్మసౌందర్యము, ఆధ్యాత్మిక సంపదయే కొలబద్దయని ఆమె ధృడంగా విశ్వసించింది. మాయా యతి రూపంలో వచ్చిన లంకేశ్వరుడు సీతమ్మ తనకు పట్టపురాణి కావడమే తన ఆశయమని చెప్పినప్పుడు, సీతమ్మ కొదమ సింహం లాగా గర్జించింది. 'రాముని భార్యను వాంఛించడమంటే సూదులతో కళ్ళు తుడుచుకోవటమని, పదునైన కత్తితో నాలుక కడుగటమని నీకు

తెలియదు కాబోలు. మండే అగ్నిని మూట కట్టాలని ప్రయత్నించకు. ఓరీ మృగమా! రాముడెక్కడ? నీవెక్కడ? మురికి కాలవకు, కడలికి; కుడితి నీళ్ళకు, అమృతానికి; నక్కకు, సింహానికి ఎంత తేడా వున్నదో; నీచుడవైన నీకు, పురుషోత్తముడైన రామునకు అంత తేడా వున్నది సుమా!' అని భూజాత అయిన సీత రావణునితో నిర్భయంగా మాట్లాడింది.

యదన్తరం కాంచన, సీసలోహయోః
యదన్తరం చందన, వారిపంకయోః
యదన్తరం హస్తి, బిడాలయోః
తదన్తరం దాశరథేస్తు, త్వయోః

తాత్పర్యం - ఓరీ! మూర్ఖుడా! బంగారమునకు సీసానికి, చందనానికి బురదకు, ఏనుగుకు పిల్లికి మధ్య ఎంత తేడా వున్నదో; రామునికి, నీకు మధ్య అంతే తేడా వున్నది.

'ఓరీ గద్దా! రాముడనే గరుత్మంతుని ఎప్పుడైనా చూశావా? ఓరీ కాకీ! రాముడనే హంస గురించి ఎప్పుడైనా విన్నావా? నీవు నన్ను అపహరించడమనేది వజ్రాన్ని మ్రింగటానికి ప్ర.యత్నించడమే అవుతుంది. గాలికి చలిస్తున్న అరటిచెట్టులాగా సీతమ్మ రావణాసురుడిని నిందించింది.

సీతమ్మ స్వభావ సిద్ధంగా అత్యంత ధైర్యవంతురాలు. ఎంత క్లిష్టమైన పరిస్థితినైనా , అనూహ్యమైన ఆపద వచ్చినా, కించిత్తైనా చలించకుండా తన ధర్మాన్ని నెరవేర్చే పరమపావని. ప్రజ్ఞావంతురాలు. సుందరకాండలో ఆమె ఎంత దయనీయమైన స్థితిలో వున్నా, ఆమె మనో నిబ్బరము, మొక్కవోని ధైర్యము చెక్కుచెదరలేదు. ఆమె ఉపవాసముతో కృశించినదై, శుక్లపక్ష ప్రారంభమున వున్న నెలవంక వలె స్వచ్ఛంగా ప్రకాశించింది.

**ఉపవాశ కృశాం దీనాం నిశ్శ్వసంతీం పునః పునః**
**దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖా మివామలమ్**
**రాజ్యం వా త్రిషులోకేషు సీతాం వా జనకాత్మజా**
**త్రైలోక్యం రాజ్యం సకలం సీతాయా వాప్నుయాత్**

- సశేషం

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో

(గత సంచిక తరువాయి) **అనుభవాలు** -వి. లక్ష్మీ నరసమాంబ

## నా ఇంటి సంరక్షణలో బాబూజీ

అబ్బాయి, కోడలితో బయటకు రావడానికి ముందు, మేమంతా అమీర్‌పేటలోని మా స్వంత ఇంట్లో వుండేవాళ్లం. అది మూడు అంతస్తుల ఇల్లు. ఇల్లు చిన్నదే! దానిని ముగ్గురికి అద్దెకు ఇవ్వడం జరిగింది. ఇంక ఎప్పుడూ ఆ ఇంటి గురించి సమస్యలే! ఆ ఇంట్లో ఏదైనా రిపేర్‌కి రావడమో, ఒక ఫ్లోర్ ఖాళీ కావడమో, ఏదో ఒక సమస్య తలెత్తుతూ వుండేది. కానీ, బాబుగారి ఆశ్రమంలో చేరిన తరువాత దాని భారమంతా ఆయనపైనే వేశాను. అందువల్ల ఏ సమస్య వచ్చినా పెద్ద చికాకు లేకుండా పరిష్కారం అవుతూ వుండేది.

అయితే ఈ మధ్య ఇంటి విషయంలో ఒక చికాకులో పడ్డాను. ఆ ఇంటి మొదటి అంతస్తును ఒక జర్నలిస్ట్‌కు అద్దెకు ఇచ్చాను. భార్యభర్తలిద్దరే వుండేటట్లు. అతను ఇంటి తాళం తీసుకనేటప్పుడు చెప్పాడు అతని మామగారు పోలీస్ ఆఫీసర్ అని. నా గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. పోలీసులకు, లాయర్లకు ఇల్లు అద్దెకిస్తే, వారు పెద్దమనుషులు కాకుంటే, చాలా చికాకుల్లో పడతాము. అయినా చేసేది ఏమీలేక వారికే ఇబ్బంది లేకుండా చూసుకున్నాను. అయితే వారింటికి ఆమె కుటుంబీకులు తరచూ వచ్చిపోతుండటంతో నీరు సరిపోయేది కాదు. దానితో అతను నీటికోసం డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. వారి కుటుంబం వలన మిగతా ఇద్దరూ ఇళ్ళు ఖాళీ చేసే పరిస్థితి వచ్చింది. అతను అందరితోనూ దురుసుగా కూడా ప్రవర్తించేవాడు. దీనితో 'నీటి సమస్య వున్నది మీకే కష్టం అవుతుంది. ఇల్లు ఖాళీ చేయండి!' అని చెప్పాను. అప్పుడు అతని మామగారు రంగ ప్రవేశం చేసి, బెదిరింపుగా మాట్లాడటం మొదలు పెట్టాడు. సమస్య పెద్దది అయ్యేటట్లు వున్నది. అతనిని గట్టిగా ఇల్లు ఖాళీ చేయమంటే ఇల్లు తాళం పెట్టుకుని పోయేటట్లు వున్నాడు. అది చాలా చిరాకు అయిన పరిస్థితికి దారి తీస్తుంది. ఆ పరిస్థితులలో బొత్తిగా మనశ్శాంతి లేకుండా పోయింది.

నేను వారిని ఎలా ఖాళీ చేయిస్తానా అని చుట్టుప్రక్కల వాళ్ళు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

ఆ సమయంలో నేను బాబుగారిని గట్టిగా తలచుకున్నాను. నేను ఎరిగిన ఒక పెద్ద పోలీసు ఆఫీసర్‌కి ఫోన్ చేసి విషయం అంతా చెప్పి, ఇల్లు ఖాళీ చేయించాలని కోరాను. నేను వచ్చి ఆయనను కలుస్తానని చెప్పాను. అందుకు ఆయన ..... 'వద్దండీ! మీరు అన్ని విషయాలు నాకు మెసేజ్ పెట్టండి చాలు' అన్నారు. వయస్సులో నేను పెద్దదాన్ని కదా! అందుకాయన నాకా శ్రమ ఇవ్వలేదు. నేను వెంటనే ఆయనకు కావలసిన విషయాలు మెసేజ్ చేశాను.

బాబుగారు నిజంగా నా యందు వున్నారు. ఇది జరిగిన ఒక వారం లోపలే ఆ జర్నలిస్ట్ నా ఇల్లు ఖాళీ చేసి, గొడవలేమీ లేకుండా వెళ్ళిపోయాడు. బాబుగారే నాకు సహాయం చేసిన పోలీసు ఆఫీసర్ మనస్సులో ప్రవేశించి, ఆయనతో ఆ జర్నలిస్ట్ పోలీసు మామకు ఫోన్ చేయించి, ఇల్లు ఖాళీ చేయించారని నేను నమ్ముతున్నాను. ఇలా బాబుగారు నాకు ప్రతి విషయంలోనూ అండగా వుండి, ప్రతి సమస్య నుండీ నన్ను గట్టెక్కిస్తున్నారు అనడానికి ఇంతకన్న నిదర్శనం ఏం కావాలి? ఆఫీసర్లను ఎంతో మందిని సహాయం చేయమని అడుగుతారు. వారు చేస్తారు కూడా. కానీ ఇంత సునాయాసంగా పని జరిగిందంటే ఊహించలేని విషయం! బాబుగారు తలచుకుంటే జరగనిదేముంటుంది?

- సశేషం

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించుకొనవలసినదిగా విజ్ఞప్తి.


పునర్జన్మ
మధుప
పునర్జన్మ ఎలా కలుగుతుంది గురుదేవా?
1
నువ్వు ఎప్పుడైనా వడ్లగింజను చూశావా నాయనా?
2


వడ్లగింజ పైన
రెండు పొరలు
ఉంటాయి కదా!
3


ఆ రెండు పొరలు
ఉన్నంత వరకు ఏ
కొంచెం తడి తగిలినా
అది మళ్ళీ మొలకెత్తి,
మొక్కగా ఎదిగి అనేక
వడ్లగింజలకు
జన్మనిస్తుంది।
4


అదే ఆ రెండు
పొరలను తీసివేస్తే అది
అప్పుడు బియ్యపు గింజ
అవుతుంది.
5


ఆ బియ్యాన్ని
ఎంతసేపు నానబెట్టినా
అది మళ్ళీ
మొలకెత్తదు. పైగా అది
అన్నంగా మారి అందరి
ఆకలిని తీరుస్తుంది.
6


ఆ వడ్లగింజకు
ఉన్న
పొరలవంటివే నీ
మనస్సును
ఆవరించిన
అహంకార
మమకారాలు.
7


ఆ రెండూ
ఉన్నంతవరకు మళ్ళీ
మళ్ళీ జన్మలు తప్పవు.
వాటిని
తొలగించుకుంటే నీకు
మళ్ళీ జన్మ లేదు.
అలాగే నీ ఈ జన్మ
పదిమందికీ
ఉపయోగపడుతుంది.
8

# ప్లవ

-పాలూరి కాళీప్రసాద్

**అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాప కృత్తమః**

**సర్వం జ్ఞాన ప్లవేనైవ వృజినం సంతరిష్యసి** - భగవద్గీత 4/36

నీవు ఎంతటి పాపాత్ముడవైనా, పాపాత్ములందరి కంటే అధికమైన పాపాలు చేసినా, ఆ పాప సాగరాన్ని నీవు జ్ఞానమనే ప్లవంతో చక్కగా దాటి పోగలవు - అని పరమాత్ముడు అభయమిస్తున్నాడు.

'ప్లవ' అనే పదానికి అనేక అర్థాలు వున్నాయి. అందులో 'గెంతు' అనేది ఒక అర్థం. గెంతుతూ వెళ్ళాయి కాబట్టి వానరాలను ప్లవగములు అంటారు. మరి అట్టి వానరాలలో ప్లవగోత్తముడైన ఆ ఆంజనేయుడు ఒక్క గెంతులో మహాసముద్రాన్ని లంఘించి సీతామాతను చేరుకున్నాడు. అప్పటి వరకు 'నేను చాలా చిన్నవాడను' అని ఒక మూల కూర్చున్న ఆంజనేయునికి అతని స్వస్వరూప జ్ఞానాన్ని జాంబవంతుడు బోధించడంతో మైనాకుడు, సురస, సింహిక అనే త్రిగుణాలతో నిండి వున్న సంసార సాగరాన్ని ఒక్క గెంతులో దాటి, పంచకోశాంతర స్థితయైన జగన్మాతను చేరుకోగలిగాడు.

అలాగే ఎంతో క్రూరుడైన రత్నాకరుడు నారద మహర్షి ప్రబోధంతో క్షణంలో పరివర్తనం చెంది వాల్మీకియైనాడు. పరమ పాపాత్ముడైన అంగుళీమాలుడు కూడా బుద్ధ భగవానుని దర్శనంతో సంపూర్ణ పరివర్తనం చెందాడు.

గురుదేవులు శ్రీ బాబూజీమహరాజ్‌వారి చరిత్రలో కూడా మనకు ఇలాంటి సంఘటనలు అనేకం కనిపిస్తాయి. భీమవరంలో నాచు వెంకటరత్నంగారనే ప్రఖ్యాత లాయర్‌గారు వుండేవారు. వారికి మహాత్ములన్నా, గురువులన్నా ఎటువంటి గౌరవం లేదు. అయినా శ్రీగురు దేవులను దర్శించుకున్న మరుక్షణంలోనే వారి మనస్సు గురుదేవుల ఆధీనమైపోయింది. లోకాన్ని, తన వృత్తిని అన్నింటినీ మరచిపోయి అలా శ్రీగురుదేవుల సన్నిధిలోనే తిరుగుతూ వుండేవారు. వారి కుటుంబ సభ్యులు వచ్చి పిలిచినా, 'నా మనస్సు ఆయన తీసేసుకున్నారు. ఆయన తిరిగి ఇస్తే కాని నేను రాలేను' అనేవారు.

అలాగే 'ఈ గురువులందరూ వేషగాళ్ళు, మోసగాళ్ళు. ఈయన

అంతు తేలుస్తాను' అంటూ వచ్చిన విఠల్ చరణదాసు గారు ఒక్క క్షణంలో శ్రీ గురు చరణదాసులై భక్తికి, శరణాగతికి పరాకాష్ఠ స్థితిని చేరుకున్నారు.

ఇలా భగవంతునికి పూర్తిగా వ్యతిరేకమైనవారు ఒక్క క్షణంలో జ్ఞానమనే గెంతుతో సంసార సాగరాన్ని దాటివేయడం చూస్తే మనబోటి వారికి అసూయ, నిరుత్సాహం కలుగుతాయి. 'చిన్నప్పటి నుండి మంచి చెడుల సమాహారంగా జీవితాన్ని గడుపుతూ, వీలున్నంత వరకూ మంచివైపు మనలను మళ్ళించుకుంటూ, ఎంతకాలమైనా మనం ఈ సంసార సాగరాన్ని పూర్తిగా దాటలేకపోతున్నామే' అనిపించడం సహజం.

ఇక్కడే 'ప్లవ' అనే పదానికి వున్న మరో అర్థాన్ని మనం తెలుసుకోవాలి. 'ప్లవ' అంటే చిన్న పడవ. **వింధ్య వీథీ ప్లవంగమః** - సూర్య భగవానుడు ఆకాశ మార్గంలో ఒక చిన్న పడవలాగా ఉదయం నుండి సాయంత్రం వరకూ మెల్లగా సంచరిస్తూ వుంటాడని ఆదిత్యహృదయం చెబుతోంది.

సముద్రంలో పడవ ప్రయాణాన్ని గమనించండి. తెడ్డువేసి నాలగు అడుగులు ముందుకు పోగానే ఒక పెద్ద కెరటమో, లేక గాలో వచ్చి మళ్ళీ రెండడుగులు వెనక్కు నెట్టుతూ వుంటుంది. అలాగే గాఢమైన భక్తికాని, గాఢమైన వ్యతిరేకతకాని లేకుండా మధ్యే మార్గంగా వుండే మనబోటి వారి ప్రయాణం కూడా సముద్రంలో పడవ ప్రయాణం లాగానే వుంటుంది. ఖాళీ సమయంలో ధ్యానమో, పూజో మరో భగవత్కార్యమో చేస్తాం. ఏదో చిన్న ఆటంకం రాగానే ఆ పూటకి విరమించుకుంటాం. అయితే మన ప్రయత్నాన్ని విరమించకుండా మళ్ళీ మళ్ళీ మన పడవను దారిలో పెట్టుకుంటూ వుంటే ఎప్పటికైనా గమ్యాన్ని మాత్రం తప్పక చేరుకుంటాం.

ఎంతటి మహాపాపాలైనా దాటాలంటే జ్ఞానమే శరణ్యం. పాపరాశిని దగ్ధం చేయాలంటే జ్ఞానాగ్నే శరణ్యం. అందుకే గీతాచార్యుడు **జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి** అన్నాడు. అయితే మన ఇంటిలో దీపం వెలగాలి అంటే ముందుగా అగ్గిపుల్ల వెలగాలి. అది వెలగాలంటే ముందు ఆ పుల్లని అగ్గిపెట్టెకి రాపిడి పెట్టాలి. అలాగే మనలో జ్ఞానాగ్ని వెలగాలంటే, ముందుగా ధ్యానం చేయాలి. ఆ ధ్యానం నిలవాలంటే మనస్సును భగవన్నామంతో రాపిడి పెట్టాలి. అందుకే **ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి** అని మన

హృదయబాబు శ్రీబాబూజీ మహరాజ్, **నామాగ్ని దగ్ధ కర్మాణి** అని శ్రీమాతాజీవారు ఉద్బోధించారు.

కాబట్టి **శార్వరి** అనే అంధకారం నుంచి జ్ఞానాగ్నిని వెలిగించుకుని ఆ జ్ఞాన 'ప్లవం'లో పాపపంకిలమైన సంసార సాగరాన్ని (ఒక్కగెంతులోగాని, పడవలో నెమ్మదిగాగాని)దాటి **'శుభకృత్'** - సకల శుభాలకు నిలయమైన మోక్ష సామ్రాజ్యాన్ని మనందరం చేరుకుంటామని ఆశిస్తూ **శ్రీ ప్లవ** నామ సంవత్సర శుభాకాంక్షలు!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఏప్రియల్ 2021**

6 మంగళ - శ్రీగురుదశమి. సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 మంగళ - శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది. ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

21 బుధ - శ్రీరామనవమి సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

27 మంగళ - చైత్ర పౌర్ణమి - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

**మే 2021**

6 గురు - శ్రీ గురుదశమి - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

16 ఆది - శ్రీ శంకరజయంతి - ఉ. 11గం సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

26 బుధ - శ్రీగురుపూర్ణిమ - సా॥5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

# మధురం మధురం మధురం

(గత సంచిక తరువాయి) - విజయ రాఘవీయం

అప్పటికి అయిపోలేదు. ఆయన అనునయన వాక్యాలు. బొంబాయి వెళ్ళిపోయిన తరువాత నేను ఈ జరిగిన విషయాన్ని తెలియజేస్తూ ఉత్తరం వ్రాశాను. దానికి జవాబు ఉత్తరం వెంటనే వచ్చింది నాకు. దానిలో శ్రీబాబు 'నా దర్శనానికి నీవు ఎప్పుడైనా రావచ్చు. తండ్రి ఆస్తిపై బిడ్డలందరికీ హక్కు వున్నది. జాగ్రత్ స్వప్న సుషుప్తి మూడు అవస్థలలో కూడా నేను నిన్ను మరువను అని గుర్తుపెట్టుకో. ధ్యాన సమయంలో మాత్రం దర్శనం కుదరదు' అని వ్రాశారు.

ఎంతటి దయామయులో చూడండి! మహాత్ములు ఎప్పుడు ఏ స్థితిలో వుంటారో మనకు తెలియదు. మన ఆతృతలో మనం వారికి ఇబ్బంది కలిగిస్తూ వుంటాము. మనం ఎన్ని తప్పులు చేసినా, ఆ దయామూర్తి తమ అపార కరుణను, ప్రేమను మనకు అందిస్తూ వుంటారు. అంతటి దయాశీల, గుణనిధి, భావాతీతుడు మన గురురాముడు. మనకు బాబును దర్శించాలని ఎంత ఆతృతో, ఆయనకు మనలని చూడాలని అంతే కుతూహలం.

ఒకసారి మాతాజీ స్వప్నంలో దర్శనమిచ్చారు. వారు మండుటెండలో స్వామి పూజకై పూలుకోస్తున్నారు. కాళ్ళకు చెప్పులు కూడా లేవు. వేసుకోకూడదు కాబట్టి వేసుకోలేదు. శ్రీబాబూజీ చెబుతూ వుండేవారు స్వామికి పూలు కోసేటప్పుడు మాట్లాడకూడదు, చెప్పులు వేసుకోకూడదు. ఎంతో పవిత్రంగా భగవన్నామం చేసుకుంటూ కోయాలని. మండుటెండలో అమ్మ పూలు కోస్తుంటే మరి కాళ్ళు కాలవూ? అసలే సుకుమార లేత ఎర్రని పాదాలు అమ్మవి. అవి కందిపోవూ? కందిపోయి ఇంకా ఎర్రగా కనబడుతున్నాయి. అమ్మ గురుదేవుని సేవలో తమ దేహాన్ని లెక్కచేయలేదు. దేహస్మృతి వారికి వుండదు. ఇది గురుదేవుల సేవలో మనం ఎలా వుండాలో నేర్పేందుకు జరిగిన సంఘటన. అంటే గురుసేవలో శీతోష్ణాలను దాటి సమతా స్థితిలో వుండటమన్నమాట. వారు శీతోష్ణ సుఖదుఃఖాలనే ద్వంద్వాలకు అతీతులు. ప్రపంచ సుఖదుఃఖాలలోపడి అలమటిస్తున్న మనలను చూసి

ఎంతో దయతో, ప్రేమతో శ్రీబాబు తమ అవతార పరిసమాప్తి అయిపోతుందని తెలిసి తిరిగి శ్రీమాతాజీ రూపంలో మన మధ్యకు వచ్చి మనలను కాపాడుతూ , ఆధ్యాత్మిక సాధనలో మనకు మార్గదర్శకులై సంచరిస్తున్నారు. మరి గురుదేవులు శీతోష్ణ సుఖదుఃఖాలకు అతీతులు కదా అందుకే వారు ద్వంద్వాతీతులని స్తుతింపబడ్డారు.

ఇప్పుడు చెప్పండి. మన గురురాముని చరితము శ్రీరామచరితము ఒక్కటా కాదా? రామాయణం వింటుంటే మనకు ఆ గుణగణాలన్నీ సుపరిచితమే అన్నట్లు, మన మనస్సులో గురుమూర్తి రూపం ముద్ర వేసుకోవడం మనందరికీ అనుభవమే కదా?

పైన చెప్పిన రెండు విషయాల ద్వారా మనకు తెలిసింది ఏమిటంటే శ్రీగురుదేవులు ద్వంద్వాలకు, భావాలకు అతీతులని.

**బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్**
**ఏకం నిత్యం విమల మచలం సర్వధీసాక్షిభూతమ్**
**భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి।**

ఇది మనం గురుదేవుని నిత్యమూ పూజించుకునే స్తుతిమాలలో ఒక పుష్పం. ఈ పుష్పాంజలితో దీనిని ముగిస్తున్నాను. జై గురుదేవ్!

## *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**ఏప్రియల్ 2021**

6 మంగళ - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ
13 మంగళ - శ్రీ ప్లవనామ సంవత్సర ఉగాది - శ్రీసద్గురుపాదపూజ.
21 బుధ - శ్రీరామ నవమి - శ్రీసద్గురుపాదపూజ.
27 మంగళ - చైత్ర పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

**మే 2021**

6 గురు - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.
16 ఆది - శ్రీశంకర జయంతి - శ్రీ సద్గురుపాదపూజ
26 బుధ - శ్రీ గురుపూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ముందు మన అనుభూతి మనకే తెలియదు. విచారణ చేయగా చేయగా తరువాత తెలుస్తుంది. ఈ విషయంలో ఎవరి అనుభూతి వారికే తెలుసు. బాహ్యంగా ఏదైనా పూజ అదీ చేస్తే వచ్చే పుణ్యాన్ని భార్య భర్తలిద్దరూ పంచుకోవచ్చునేమో. ఒకరు చేస్తే, పుణ్యం మరొకరికి కూడా రావచ్చేమో. కానీ, ఇక్కడ ఈ విషయంలో అలా కాదు. ఆధ్యాత్మిక విషయంలో కూడా పుణ్యం భార్యాభర్తలు పంచుకోవచ్చునేమో. ఆ భార్య భర్తలిద్దరూ అరుంధతి వశిష్టుడు లాగా వుంటే, నిరతంతరం విచారణ చేసుకుంటే, బయట ప్రపంచం గురించి విచారం వుండదు. అటువంటి స్థితికి తీసుకుని వెళ్ళేది ఆత్మవిచారణ అని మనకు గురువులు గుర్తింపజేస్తున్నారు.

16వ మంత్రంలో .... ఏది పరబ్రహ్మమో, ఏది సర్వమందు ఆత్మగా వున్నదో, ఏది విశ్వమునకు మహత్తరమైన ఆధారవెూ, ఏది సూక్ష్మముకంటే సూక్ష్మమో, ఏది నిత్యమో అదే నీవు. నీవూ అది భిన్నం కావటంలేదు.

కుండని ఉదాహరణగా తీసుకుంటే అది మట్టితో చేయబడినది. అదే మట్టితో ప్రమిద కూడా చేయబడింది. మట్టితోనే చేయబడినా రెండూ వేరువేరు పేర్లతో పిలువబడుతున్నాయి. ఈ పరబ్రహ్మ సమస్తానికి ఆధారంగా వుంది. సర్వాత్మనా భావన అంటారు. సమష్టి భావన అంటారు. ఏకాత్మనా భావన వ్యష్టి భావన.

ఆత్మజ్ఞానం కోసం ఒక విద్యార్థి ఎన్నో గ్రంథాలు చదివి తెలివితేటలు కలిగి తీక్ష్ణమైన బుద్ధి కలిగినవాడుగా గురుపాదములను ఆశ్రయిస్తాడు. శిష్యుని బుద్ధి ఎంత సున్నితమై , సూక్ష్మత్వం కలిగినప్పటికీ, బుద్ధి విషయ ప్రపంచాన్నే గ్రహించగలదు. ఆ శిష్యుని సూక్ష్మబుద్ధికి తగినట్లుగా గురువు తన బోధల ద్వారా విషయ ప్రపంచంలో విషయాన్ని ఉదాహరణ ద్వారా ఉపదేశిస్తారు. ఈ విధంగా గురుబోధ ద్వారా శిష్యుడు తన సూక్ష్మ బుద్ధిని వినియోగించి, స్వయంగా పరిశోధనలు చేసి, ఆత్మతత్వాన్ని తెలుసుకోవడానికి ఒక విధానాన్ని గురువు

ఉపదేశిస్తాడు. శిష్యుడు గురువాక్యాన్ని ఆత్మతత్వాన్ని కేవలం బుద్ధితో గ్రహించి స్వీకరిస్తే చాలదు. అతను ఆత్మతత్వాన్ని ఆత్మీయంగా అనుభవించాలి.

ఉదాత్త విషయాలతో కూడిన బోధ వలన, ఆ పరమాత్మ ప్రవర్తించే విధానమును పరిశోధించడం వలన శిష్యుని బుద్ధి శక్తి తీక్షణమై ఇంద్రియ సాధనలకు, విషయ క్షేత్రాలకు మూలకారణమైన **తత్** -దానిని ఆ పరమాత్మను తెలుసుకోగలుగుతోంది.

మనం చూసే దృశ్యంలో ఎన్నో ఉపాధులు వున్నాయి. ఆ వుపాధులలో వున్నది, మనలో వున్నది ఒక్కటే. సృష్టికి ఉపాధులు అవసరం కాబట్టి భగవంతుడు వాటిని సృష్టించాడు. ఆలోచిస్తే మనకు కూడా ఈ ఉపాధి లేకపోతే, విచారణలో ఆనందాన్ని పొందలేము. అంతా బ్రహ్మమే. కానీ, మానవుడిని సృష్టించి, మానవత్వాన్నిచ్చి, మనస్సునిచ్చి, మళ్ళా తన తత్వం ఇంత గొప్పదని తెలియపరచి, విచారణ చేయించి, దాని వలన నిజమైన సంతృప్తిని కలిగింపజేస్తున్నారు గురువులు తమ బోధల ద్వారా. విషయం తెలియకపోతే ఒకరితో ఒకరు విచారణ చేసుకోవచ్చు. తెలిస్తే **'నీవు చూచినదెల్ల నీవయె అను తత్వమసి వాక్యమునకర్థము నిజము'** అని మహాత్ములు అన్నట్లుగా - కళ్ళు తెరిచి చూస్తే ఎన్నో కనబడతాయి. ఆ కనబడటానికి కారణం కళ్ళు తెరచి చూసినవారే. (నీవు చూచినదెల్ల నీవయె).

అయితే మానవుడు ఈ విధంగా విచారణ చేయకుండా, సృష్టిలో చూసిన ప్రతి దాన్నీ మీదవేసుకుని కర్మను తెచ్చిపెట్టుకుంటున్నాడు, పెంచుతున్నాడు. తద్వారా సుఖదుఃఖాలకు లోనవుతున్నాడు. మనకు అవసరం లేని దాన్ని గురించి ఆలోచించడం వలన, కాలం వ్యర్థం చేసుకుంటున్నాడు. ఇప్పటి రోజులలో ఆధునిక పరికరాలు సెల్‌ఫోన్‌ల వంటివి. ఒకసారి నేను నార్వే దేశంలో పర్యటించినప్పుడు పిల్లలందరితో సద్గోష్ఠి జరుపుతూ వారిని ప్రశ్నలు వేసి సమాధానం చెప్పమంటే ఒక కుర్రవాడు చాలా బాగా, గబ గబా చెప్పాడు. ఎలా చెబుతున్నాడా? అని చూసేసరికి ప్రక్కనే సెల్ ఫోన్ పెట్టుకుని అందులో ఇంటర్‌నెట్ ద్వారా సమాధానాలు చూసి చెబుతున్నాడు. ఒక విధంగా ఆలోచిస్తే, ఏదో వాటికీ వీటికీ కాకుండా మంచి విషయాలకే

ఉపయోగించినా, ప్రశ్నలు అడిగినప్పుడే చూడాలా? అది దొంగతనమే అంటాను. ఇలా ప్రశ్నలు వేయడానికి కారణం, కొంతసేపు సద్విషయాన్ని గురించి మననం, విచారణ చేస్తారనే. శ్రీగురుదేవులు కూడా ఇలానే చేసేవారు.

**తత్వమేవ, త్వమేవ తత్** - అదే నీవు, నీవే అది అని శిష్యుడు ఇంకా దృఢంగా గ్రహించాలని, ఆ పరబ్రహ్మం అతనిలో వున్న ప్రత్యగాత్మకంటే వేరు కాదని, అదే నీవు అని గురువుబోధ చేస్తున్నాడు. సర్వాత్మ అంటే సర్వవ్యాపియైన పరమాత్మ. ఇప్పుడు మనం కూడా పరమాత్మలోనే వున్నాము. ఉన్నది అంటే అస్తిత్వం. ఆత్మ ఒక్కటే వున్నది.

ఆ పరమాత్మ విశ్వమంతటకీ మహత్తరమైన ఆధారం. ఉదాహరణకు సముద్రం తరంగాలకు ఆధారం. బంగారం ఆభరణాలకు ఆధారం. మట్టి కుండకు ఆధారం. అంటే ఇక్కడ సముద్రము, బంగారము, మట్టి ఉపాదాన కారణాలు. తరంగాలు, ఆభరణాలు, కుండ నిమిత్త కారణాలు. ఆత్మ విశ్వమునకు ఉపాదాన కారణము. ప్రపంచమునకు ఆ పరబ్రహ్మమే మూలాధారమై వున్నది. ఆత్మ వస్తువు మహా సూక్ష్మము. బ్రహ్మం సర్వవ్యాపి. ఆ బ్రహ్మ అన్ని నామరూపాలలోనూ కేంద్రమైన ఆత్మగా (సర్వాత్మ) మాత్రమే కాకుండా అన్నిటికీ మూలమై వుంది. అన్నిటినీ వ్యాపించి వున్నది. కానీ ఆత్మను వ్యాపించి ఏదీ లేదు. అది నిత్యమైనదీ, మార్పులేనిది.

అట్టి **తత్** నీవే. నీవే ఆ **తత్**. కాబట్టి నీవే ఆ పరమాత్మ అని గురువులు శిష్యునిలోని భేదభావాన్ని తొలగించడానికే **త్వమేవతత్** అనే వాక్యం గురువు శిష్యునకు బోధించే ఉపదేశవాక్యమై వున్నది. దీనిని శిష్యుడు స్వయంగా తన మనస్సులో ఆత్మీయంగా తెలుసుకోవడమే శ్రేష్ఠమైన జ్ఞానం. దీనినే ధ్యానము అంటారు. గురువులు ఆవిధంగా తమని తాము అంతటా చూడగలిగే స్థితిలో వుంటారు. అంటే వారిలోనూ, విశ్వమంతటా బ్రహ్మ స్వరూపంగా చూడగలుగుతారు కాబట్టే వారి బోధ ఆ విధంగా వుంటుంది. ఆ స్థితికి మనం ఎంతవరకు వచ్చాం? అని మనను మనమే చూసుకుంటూ సాధన కొనసాగిస్తూ వుండాలని గురువు అట్టి స్థితిని మనకు అనుగ్రహించుగాక!!

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఏప్రియల్ 2021**

6 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 శని - మాస శివరాత్రి.

12 సోమ - అమావాస్య

13 మంగళ - శ్రీ ప్లవనామ సంవత్సర ఉగాది.

14 బుధ నుండి 20 మంగళ వరకు మౌనధ్యాన సప్తాహ శిబిరం.

21 బుధ - శ్రీరామ నవమి - తె॥ 5-30ని॥ శ్రీ సద్గురుపాదపూజ, ఉ. 11గం. శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన

27 మంగళ - చైత్ర పౌర్ణమి - శ్రీ సద్గురు పాదపూజ

**మే 2021**

6 గురు - శ్రీ గురుదశమి. ఉ॥ 10గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 సోమ - మాస శివరాత్రి

11 మంగళ - అమావాస్య

14 శుక్ర - అక్షయ తృతీయ. ఉదయం 11గం.శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 ఆది - శ్రీ శంకరజయంతి. శ్రీబాబు మూర్తి ప్రతిష్ఠావార్షికోత్సవం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

26 బుధ - (వైశాఖ) శ్రీ గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

31 సోమ - ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవం - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఏప్రియల్, మే 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఏప్రియల్ 2021 :*** AS 4102, 6345, 6431, 7070, 7256, 7269, 7742, 7743, 8016, 8025, 8026, 8035.

***మే2021 :*** AS 6900, 7069, 7272, 8038, 8056, 8057, 8138, 8139

# శ్రీ బాబూజీతో అనుభవాలు

- కోసూరు అరుణ కుమారి

నా పేరు అరుణ కుమారి. మోపిదేవి అనే ఊరిలో "మోపిదేవమ్మ" అమ్మవారు వెలిశారు. అందరూ ఆశ్రమంలో నన్ను "మోపిదేవమ్మ" అని పిలుస్తారు. మా ఊరు మోపిదేవి దగ్గర ఉన్న కూసూరివారి పాలెం. మేము మోపిదేవిలో ఉంటాం. మా వారి పేరు రమేష్‌కుమార్‌గారు.

మా ఊరిలో మావారి తాతగారైన కాంతయ్యగారు రేణుకా దేవికి, అంకమ్మ తల్లికి గుళ్ళు కట్టించారు. భక్తులు ఆ గుళ్ళను దర్శించి కృతార్థత పొందుతున్నారు.

నాకు ఇద్దరు పిల్లలు. వారి చిన్నతనంలోనే మా వారు పొలంలో నీళ్ళు పెట్టటానికి వెళ్ళి హైటెన్షన్ వైరు మీద కాలు పడి 2012లో హఠాత్మరణం చెందారు.

శ్రీ బాబూజీ మహాప్రస్థానం చేరిన తరువాత నేను, మా వారు ఆశ్రమానికి వచ్చేవారము. మేము వచ్చినప్పుడు,శ్రీ మాతాజీ వారు మమ్మల్ని ఆప్యాయంగా పలకరించి మా యోగక్షేమాలు తెలుసుకునేవారు.

మేము కష్టాలలో ఉన్న సమయంలో కలలో కన్న తండ్రిగా శ్రీ బాబూజీ మహరాజ్‌వారు మోపిదేవిలో మా ఇంటికి వచ్చి తలుపులు తట్టి లోపలకు వచ్చి అభయము ఇచ్చారు. ఆ అభయము వలనే ఎన్ని కష్టాలు ఎదురైనా ఇలా ఉన్నాము, లేకపోతే ఏమైపోయేవాళ్ళమో!

మా వారి మరణానంతరం నేను, మా పిల్లలు, కాళీవనాశ్రమానికి వచ్చి మాతాజీవారిని కలిశాము. మాతాజీ గారు మమ్మల్ని పిలిచి ఊరడించారు. మేము వెళ్ళి మాతాజీగారు పాదాల దగ్గర కూర్చుని, "అమ్మా మేము కూడా ఇక్కడే ఉంటాము" అన్నాము. ఆ సంగతి తరువాత చూద్దాము, ఇప్పుడు ఏమి చేద్దాము? అన్నారు మాతాజీ. అప్పుడు మా అబ్బాయి, "మా అక్క కళ్ళేపల్లిలో టీచరుగా పని చేస్తోంది. రోజూ వెళ్ళకుండా కళ్ళేపల్లిలోనే ఒక ఇల్లు అద్దెకు తీసుకొని అమ్మను అక్కను అక్కడ ఉంచి, బెంగుళూరులో మా బంధువులు ఉన్నారు. నేను బెంగుళూరు వెళతాను. అక్కడ ఉద్యోగానికి ప్రయత్నిస్తాను. మీ ఆశీర్వచనము కావాలి" అన్నాడు. "సరే నాన్నా! తప్పకుండా మీ కోసము బాబూజీని ప్రార్థిస్తాను" అన్నారు మాతాజీ.

నేను, మా అమ్మాయి ప్రత్యూష కళ్ళేపల్లి వెళ్ళాము. మా అబ్బాయి (వీర వెంకట రవికాంత్) బెంగుళూరు వెళ్ళి అమ్మ (మాతాజీ) దయవల్ల జాబ్‌లో చేరాడు. మాకు సర్వమూ మాతాజీ గారే. శ్రీబాబు రూపంలో ఉన్న అమ్మే మాకు తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ మాతాజీవారే..

కన్న తండ్రి రారా  నా కాళీ బాబు  రారా
నీ కోసమె  పరితపించు  నన్ను బ్రోవ  రారా  ॥కన్న॥

1. భువిపైనే  ఉన్నావని  ఎవరో  చెప్పారు
ఉరుకులతో పరుగులతో నిన్ను చూడ వచ్చాను
సుందరమగు నీ రూపము  తనివితీర కాంచెద
తహ తహ  లాడేటి  నన్ను బ్రోవ  రారా  ॥కన్న॥

2. ఊహ తెలియకున్న నాడు కనబడు తుంటావట
మది కలుషిత మైనవాడు  మాయ మౌతావట
నా వశమా నిను పొంద  యశోదనా  బంధింప
జాలిచూప  రావయ్యా  జగమేలే  దైవమా  ॥కన్న॥

3. మధురమైన నీ నామము నిరతము నే తలచితిని
దివ్యమైన నీ మహిమను  నే  గానము  చేసితిని
కరుణ కోరి  కన్నీటితో నీ పాదాలు కడిగేను
గలగల మని నవ్వుచూ  కనుల ముందు రారా  ॥కన్న॥

4. నియమాలు నిష్టలతో  నిత్యము నిను అర్చించి
అతి మరువక నీ నామము  నిరతము నేతలచితిని
ప్రేమ పంచి మంచి పెంచి  స్వార్థము  వీడనాడితె
సాక్షాత్కారము కలదని ఇప్పుడే  నేనెరిగితిని  ॥కన్న॥

నేను ఎప్పుడూ ఈ పాట పాడుకుని ఊరట పొందుతూ వుంటాను..

మేము వేసవికాలము సెలవలలో ఆశ్రమానికి వచ్చాము. మాతాజీ గారు మమ్మల్ని ఆప్యాయంగా పలకరించి, “బాగున్నారా?” అన్నారు. మేము,“బాగున్నాము” అమ్మా! అన్నాము. ‘వాడు (అబ్బాయి)

ఏమి చేస్తున్నాడు' అన్నారు? "బాగానే ఉన్నాడమ్మా! వాడికి కలలో బాబూజీ కనిపించారటమ్మా, తెల్లటి కారులో, తెల్లటి వస్త్రములతో కారులో నుంచి దిగుతుంటే అబ్బాయి చూసి పరగెత్తుకుంటూ కారు దగ్గరకు వెళ్ళి, " బాబూజీ! అన్నాడట. "ఊ" ఏమి చేస్తున్నావు?" అన్నారట బాబూజీ. "మీరు జాబ్ ఇప్పిచ్చారు కదా! జాబ్ చేస్తున్నాను" అన్నాడట. ఏమైనా కావాలంటే అడుగు మాఅమ్మడికి చెపుతా, మా అమ్మడికి లోకమంతా తెలుసు" అన్నారట.'అలాగే బాబూ!' అన్నాడట" అని మాతాజీగారికి చెప్పాము. మాతాజీగారు, "మంచిది" అన్నారు. మా అబ్బాయి బాబూజీని చూసి ఉండలేదు.

నిజంగానే తరువాత మాతాజీగారు బెంగుళూరు వెళ్ళారు. వారు మా అబ్బాయిని చూసి, ఎంతో ప్రేమతో, "వచ్చావా? ఉద్యోగం ఎలా వుంది?" అని అడిగారు. "బాగుంది అమ్మా!" అన్నాడు. అమ్మ ప్రసాదం తీసుకుని వెళ్ళమనిచెప్పి ఆశీర్వదించి పంపించారు. మా అబ్బాయికి ముందు బాబూజీ కలలో కనిపించి తరువాత నిజముగా మాతాజీగారే వచ్చి బెంగుళూరులో దర్శనం ఇచ్చారంటే, "బాబూజీయే మాతాజీ" అని మాకు నిదర్శనము అయింది.

- సశేషం

## భక్తులకు విన్నపము

శ్రీగురుదేవుల అనుగ్రహం వలన భక్తులు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసే ఉద్దేశ్యంతో తమ తమ అనుభవాలను వ్రాసి పంపమని విజ్ఞాపన చేసియున్నాము.

శ్రీగురుదేవుల స్వస్వరూప లయం తరువాత, శ్రీగురుమాత ద్వారా మనకు అనేకవిధాల రక్షణ జరుగుతోంది. అనేక లీలలను వారు చూపిస్తున్నారు. అనేక దివ్యానుభవాలు భక్తులకు కలుగుతున్నాయి.

భక్తులు పొందిన అట్టిఅనుభవాలను భక్తులందరూ పంచుకొనే సంకల్పంతో తలపెట్టిన "శ్రీసద్గురునాధుని దివ్య చరిత్ర - 3" గ్రంథం పేరు మార్చి **"శ్రీ గురు కృప"** అని పేరు నిర్ణయించటం జరిగింది.

అందరూ ఈ మార్పును గమనించి తమ తమ అనుభవాలను సమగ్రంగా వ్రాసి సత్వరంగా పంపమని ప్రార్థిస్తున్నాము.

# శ్రీ నృసింహ యోగీంద్రులు

(గత సంచిక తరువాయి) - మురళి

ఇంతలో ఒకరోజు యోగీంద్రులు చీకటిపడుతున్న వేళ నదీ స్నానానికి వెడుతుండగా, ఒక వయస్సు మీరిన వ్యక్తి వచ్చి 'బాబూ! రామలాలా ఆశ్రమం ఇదేనా?' అని అడిగారు. ఆ వచ్చినవారు యోగీంద్రుల తండ్రియే. చీకటిగా వుండటం వలన, చూసి చాలా కాలం అవడం వలన వారు యోగీంద్రులవారిని గుర్తుపట్టలేదు. కానీ, యోగీంద్రులవారు మటుకు తమ తండ్రిని గుర్తుపట్టి, భయపడి స్నానానికి ముందుకు సాగిపోయారు. తండ్రి లక్ష్మీ నారాయణగారు ఆశ్రమం లోపలికి వెళ్ళి, రామలాలా ప్రభువులను దర్శించుకుని, 'స్వామీ! నేను తూర్పు గోదావరి జిల్లా గంటి గ్రామం నుండి వచ్చాను. నా పేరు లక్ష్మీనారాయణ. మా కుమారుడు నృసింహమూర్తి ఇక్కడ వుంటున్నాడని తెలిసి వచ్చాను. అతని కోసం అతని తల్లి, నేనూ పరితపిస్తున్నాము. దయచేసి అతనిని నాతో పంపవలసినది' అని దీనంగా ప్రార్థించాడు.

అంతట శ్రీరామలాలా ప్రభువులు 'ఇక్కడే వున్నాడు. పిలిపిస్తాను' అని చెప్పి, శిష్యులను పంపి పిలిపించారు. యోగీంద్రులు వచ్చి ప్రభువుల ముందు చేతులు కట్టుకుని, తలవంచుకుని నిల్చున్నారు. ప్రభువులు యోగీంద్రులతో 'నర్సింగ్! మీ తండ్రిగారు వచ్చారయ్యా! నీ తల్లిదండ్రులు నీ కోసం పరితపిస్తున్నారట. నిన్ను ఇంటికి తీసుకువెళ్ళి నీకు వివాహం జరిపించి వారితో వుంచుకోవాలని కోరుతున్నారు' అని చెప్పారు.

యోగీంద్రులు మాట్లాడుతూ 'ప్రభూ! నా జీవితాన్ని మీకు అర్పించాను. తమరు, శ్రీ సర్వానందావధూత స్వామి నాకు సమస్త విద్యలు నేర్పించి ఇంతటి వాడిని చేశారు. నాకు గృహస్థాశ్రమంలో ప్రవేశించే వుద్దేశం లేదు. ఇక్కడే వుండి తమరి సేవ చేసుకుంటూ తరించాలని నా కోరిక. దయచేసి నన్ను అనుగ్రహించి తమ నుంచి దూరం చేయకండి. శ్రీ అవధూత స్వామిని విడిచి వచ్చిన తరువాత, తమరు ప్రేమామృతాన్ని వర్షించి నన్ను చేరదీయడంతో వారి వియోగాన్ని నేను తట్టుకోగలిగాను. ఇప్పుడు తమరి నుంచి దూరం అయి నేను ఎలా జీవించగలను? మీ పాదాల వద్ద నుండి మాత్రం నన్ను దూరం

చేయవద్దు' అంటూ ప్రభువుల పాదాలపై పడి భోరున ఏడ్చాడు. ప్రభువులు వేరే శిష్యుడిని పిలిచి, యోగీంద్రుల తండ్రిగారికి వుండటానికి తగిన వసతి చూపించి, అన్నపానాదులకు ఏర్పాటు చేయమని ఆదేశించారు. యోగీంద్రులను తమ ప్రక్కన కూర్చోబెట్టుకుని, 'నర్సింగ్! నీవు ఇన్ని సంవత్సరాల సాధన చేసి నేర్చుకున్నది ఇదేనా? నీ జీవితాన్ని నాకు అర్పించాను అన్నావు. అంటే ఏమిటి? నీ జీవితంపై నీకు ఇంకా అధికారం వుందా? నీ గురుదేవుడిని ఈ పాంచభౌతిక దేహంలో మాత్రమే చూడగలుగుతున్నవా? ఇంకెక్కడా దర్శించలేవా? పిచ్చివాడా! సర్వ సమర్థుడైన గురుదేవుడు సర్వవ్యాపి కాదా? నీ చుట్టూ వున్న ప్రాణులందరిలోనూ నీ గురుదేవుడు లేడా? గురువు అంటే త్రిమూర్తి స్వరూపుడే కదా, అంటే సర్వే సర్వత్రా వ్యాపించి వుంటాడు కదా! ఇక నీవు దూరం అయ్యేది ఎవరికి? నీవు ఎక్కడ వున్నా, నీ సాధన మరువకు. సర్వ జీవులలోనూ గురుదేవుని చూడగలుగుతావు. నీ తల్లిదండ్రుల కోరిక మేరకు శాస్త్రాధ్యయనము చేస్తూ భక్తి మార్గాన్ని మీ దేశమంతటా ప్రచారం చేసి భక్తులను తరింపజేయి. నీవు భక్తులకు చేసే సేవ నాకే చెందుతుంది. వివాహం చేసుకుని మీ వంశాన్ని ఉద్ధరించు. లేని యెడల నీ కర్మశేషం మిగిలిపోయి మోక్షమార్గానికి అడ్డు వస్తుంది. నీవు ఇక్కడకి ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావచ్చు' అని బోధించి, సమాధాన పరచి తండ్రి గారితో బయలుదేరి వెళ్ళడానికి ఉద్యుక్తుడిని చేశారు. యోగీంద్రులు తండ్రిగారితో కలసి స్వగ్రామం గంటి చేరుకున్నారు.

1938వ సం.లో శ్రీరామలాలా ప్రభువులు అవతార పరిసమాప్తి సమయానికి ముందుగానే యోగీంద్రులు ఋషీకేశ్ చేరుకున్నారు. అక్కడ కొంతకాలం ఆశ్రమ నిర్వహణకు చేదోడుగా వుండి తిరిగి స్వగ్రామం చేరుకున్నారు. శ్రీరామలాల ప్రభువుల ఆజ్ఞానుసారం భక్తి మార్గాన్ని ఆంధ్రదేశమంతటా ప్రచారం చేస్తూ శేష జీవితం గడిపారు. శ్రీ నృసింహ యోగీంద్రులు తమ 64వ ఏట, 1978 జూన్ 16న శ్రీ సద్గురుసాయుజ్యం పొందారు.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

19-2-1965: మూడవ రోజు ఆలయ దర్శనముల అనంతరం ఆ రాత్రి అందరూ బయల్దేరి గుంటూరు వెళ్ళారు.

1-3-1965: మహాశివరాత్రి. సోమవారం కలిసి వచ్చింది. 70 సంవత్సరాల తరువాత మళ్ళీ యిలా కలిసి వచ్చిందని శ్రీ బాబు చెప్పారు. ముంజవరపుకొట్టులో మహాశివరాత్రి మహోత్సవాలు యీ సంవత్సరమే ప్రారంభమై, 1972లో ఆశ్రమ స్థాపన వరకు అప్పన భూషణమ్మగారింట్లో జరిగాయి.(శివరాత్రి మహోత్సవ వివరాలను మరొక అధ్యాయంలో చూడండి).



17-3-1965: ఫాల్గుణపూర్ణిమ - పాండుగారి ఇంట్లో.

12-4-1965: ఈ రోజు నుంచి 27-4-1965 వరకు రాజమండ్రిలో జయంతులు.

16-4-1965: శ్రీ బాబు దివ్య బోధ. గోపికల భక్తి ప్రాశస్త్యాన్ని వివరించటానికి "శ్రీకృష్ణుడు తెచ్చి పెట్టుకున్న తల నొప్పి" కథ.

22-4-1965: తెల్లవార్లూ గురుపూజ.

3-5-1965: శ్రీ బాబు భక్తులతో కలిసి ధవళేశ్వరం వెళ్ళి గోదావరిలో స్నానాలు చేశారు. గోదావరిలో శ్రీ బాబు మధ్య నిలబడి ఉండగా, స్త్రీలందరూ చుట్టూ నిలబడి చేతులతో వలయం కట్టారు. సంకీర్తన జరుగుతుంటే ఆ వలయాలలో వ్యతిరేక దిశలలో తిరుగుతూ భక్తులు నృత్యం చేశారు. రాసలీలా వైభవం పునరావృత మైనట్లనిపించింది.

4-5-1965 :ఈ రోజు కూడ ధవళేశ్వరంలో గోదావరి స్నానాలు చేశారు. నదిలో దిగి సంకల్పం చెబుతుంటే పెద్దగలి వీచి యిసుక తుఫాను వలె చెలరేగింది. భక్తులు స్వామి దగ్గర చేరి, స్వామినే ఆసరాగా చేసుకుని నిర్భయంగా నిలిచారు. కొద్ది మంది మాత్రం భయపడిపోయి బసలకు వెళ్ళిపోయారు. "చూశారా! ఈ యిసుక తుఫాను మనకొక పాఠం నేర్పుతున్నది. తిరగలి రాళ్ళకు మధ్య గురుజు కర్ర ఉంటుంది. తిరగలిలో బియ్యపు గింజలు వేసి విసురుతుంటే, రాళ్ళ క్రిందకు వెళ్ళిన గింజలు పిండి పిండి అయిపోతాయి. కాని కొన్ని గింజలు గురుజు వద్దనే చేరి

వుంటాయి. అవి చెక్కు చెదరవు. భూమి, ఆకాశము అనే తిరగలి రాళ్ళతో సృష్టి చక్రం త్రిప్పుతూ మధ్యలో గురుజు వలె ఆధారంగా భగవానుడు వుంటాడు. జీవులు బియ్యపు గింజలు. సృష్టిలోని చిత్ర విచిత్రాలలో పడి గురుజుకు (భగవానునికి) దూరంగా వెళ్ళిన గింజలు (జీవులు) పిండి పిండి అయిపోతారు. గురుజును (భగవానుని) ఆశ్రయించిన గింజలు (భక్తులు) ఆ భగవానుని రక్షణ పొంది నిరపాయంగా నిలిచి ధన్యులౌతారు" అని చెప్పారు.

5-5-1965: ఈ రోజు కూడ ధవళేశ్వరంలో స్నానాలు జరిగాయి. ఆ సాయంకాలం సత్సంగ సమావేశంలో భాగవతుల సూర్యనారాయణ గారు ఫిడేలుపై చక్కగా గానం చేశారు. ఒక కీర్తనలో శ్రీ బాబు పేరు కలిపి పాడేసరికి శ్రీ బాబు "తానే అక్షర స్వరూపుడైన వానిని అక్షరాలలో ఎలా యిరికించ గలరయ్యా?" అంటూ '**జలజాత ప్రభావాదులున్**' అనే భారతంలోని పద్యము, '**మాయామేయ జగంబె నిత్యమని**' అనే సత్య హరిశ్చంద్ర నాటకంలోని పద్యము,'**సరసిజ నేత్రి**' అనే మరో పద్యము మనోహరంగా పాడారు. ఆ తరువాత మంచిరాజు సత్యనారాయణగారు, కామేశ్వరమ్మగార్లను పాడమన్నారు. వాళ్ళు '**మనసు నిల్ప శక్తి లేకపోతే మధుర ఘంట విరులపూజలేమి సేయును?**'అనే త్యాగరాజ కీర్తన చక్కగా పాడారు.

శ్రీ బాబు నిజమే! ఎన్ని పూజలు, వ్రతాలు, జపాలు, యజ్ఞ యాగాలు చేసినా, మనస్సును భగవంతుని యందు నిలప లేకపోతే అవన్నీ నిష్ప్రయోజనం" అన్నారు. ఆ కీర్తన లోనే "**సోమిదమ్మ సొగసు గాంధ్ర గోరితే, సోమయాజి స్వర్గార్హుండౌనా?**" అనే చరణం పాడినప్పుడు 'శ్రీ బాబు పక పకా నవ్వి, "త్యాగరాజ స్వామికి మంచి కామిక్(హాస్యము) కూడా తెలుసు" అని, "సోమయాజి (మానవుడు)యజ్ఞాలు చేసినా, (సోమిదమ్మ) అతని మనస్స సొగసు గాంధ్రను కోరుతుంటే (విషయాదుల వెంట పడితే), ఆసోమయాజికి నరకమే(దు:ఖమే) గాని స్వర్గం (నిజమైన ఆనందం) ఎలా కలుగుతుంది?" అని దాని అర్థం వివరించి చెప్పారు.

7-5-1965: 'అమ్మ' పీఠం రాజమండ్రిలో ఉంచి, సీతమ్మగారిని పూజ చేయమని చెప్పి శ్రీ బాబు కలకత్తా వెళ్ళిపోయారు.

వైశాఖ పూర్ణిమ పూజ శ్రీ బాబు భక్తులతో సహా పూరీ యాత్రలో ఉండగా జరిగింది.6.6.1965 నాటికి శ్రీ బాబు 'అమ్మ' పీఠంతో సహా భీమవరం వెళ్ళారు.

-సశేషం

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# బోధల బావా

శ్రీ పండరీపురం సమీపంలో ధామణ గ్రామంలో మాణకోజి బోధలబావా అని భగవద్భక్తుడు ఉండేవాడు. అతడు వ్యవసాయం చేసికొని జీవితం గడుపుతున్నాడు. అతని భార్య పేరు మమతాబాయి. మహా పతివ్రత. వీరికి యామాజీ అను ఒక పుత్రుడు కలిగాడు. ఇతని బార్య పేరు భాగీరథీబాయి. ఈ నలుగురూ సంసారంలో ఉన్నా భక్తియుక్తులై, వైరాగ్యశీలురై శ్రీ పండరీనాధుని నిరంతర ధ్యానంలో కాలం గడుపుతున్నారు. దీనులను పోషిస్తూ, యాచకులకు అభీష్ఠ పదార్ధాలను ఇచ్చి సంతుష్టులను చేస్తూ ఉండేవారు. ప్రతి పక్షమందు ఏకాదశికి పండరిపురానికి వెళ్ళి పుండరీకవరదుని దర్శించి ఆనాడు ఉపవాసం చేసి ద్వాదశి రోజున అతిధులకు, దీనులకు సంతర్పణ చేసేవారు.



ఇలా కాలం ఆనందమయంగా గడుస్తోంది. కొన్ని రోజుల తరువాత దేశంలో అనావృష్టి చేత క్షామం వచ్చింది. ప్రజలు తినటానికి తిండిలేక బాధపడుతున్నారు. బోధలబావా వీరి కష్టములకు జాలిపడి భార్యతో “దేవీ! ఈ కాటకం తొలగి మామూలు స్థితికి వచ్చేవరకు ఆకలి అని వచ్చిన వారికి రాత్రియైనా, పగలైనా విసిగి కొనక నాస్తి శబ్దం నోట రానీయకుండా అన్నము పెట్టు. చెట్టుకు నీళ్ళు పోయటము, ఆకలిగొన్నవానికి అన్నం పెట్టుటము, చలితో పీడింపబడతున్నవానికి వస్త్రం ఇవ్వటము, రోగార్తులకు ఉపచారం చెయ్యటము, బీదలను ఆదుకొనటము, అహంకార మమకార గ్రస్తులకు వైరాగ్యం కల్పించటము,

అసత్యవాదులకు సత్యవస్తువు గురించి తెలపటము, భగవద్విముఖులకు, భగవద్భక్తిని కలుగజేయటము, భగవంతునికి ముఖ్య ఆరాధనములై ఉన్నాయి. ఇవి చేయక, చేసే యజ్ఞయాగాలు, ఆలయ, తటాక ప్రతిష్టలు మోక్షం తెచ్చిపెట్టలేవు. కాబట్టి ఆకలిగొన్న వారిని నీ బిడ్డలుగా భావించి ఆదరించు "అని చెప్పాడు.

మమతాబాయి భర్త ఆదేశాన్ని శిరసావహించి ఎంతో జాగరూకతతో అన్నార్తులకు అన్నపానీయాలు ఇచ్చి తృప్తిపరిచింది. ఈ సంగతి తెలిసి ప్రక్క ప్రదేశాలనుండి జనాలు బోధల బావా ఇంటికి రావటం మొదలుపెట్టారు. ఎందరు వచ్చినా మమతాబాయి అందరికీ అన్నపానీయాదులు ఇచ్చి తృప్తిపరుస్తోంది. ఇంట్లోవున్న డబ్బు అంతా ఖర్చు అయిపోయింది. ఇంట్లోవున్న నగలను అమ్మి వచ్చినవారి నందరినీ ఆదరించాడు. తరువాత పశువులు, గుఱ్ఱాలు అమ్మివేశాడు. ఆ వచ్చిన డబ్బుతో బీదలను తృప్తిపరుస్తూ నిరంతరం పాండురంగ ధ్యానంలో ఆనంద పరవశుడైయుండగా ఏకాదశి వచ్చింది.

పండరికి వెళ్ళాలి, కానీ చేతిలో డబ్బులేకపోవటంతో అడవికి వెళ్ళి కట్టెలును ఏరి తెచ్చి వాటిని అమ్మితే మూడు కాసులు వచ్చాయి. అవి పట్టుకొని పండరి జేరాడు. చంద్రభాగలో స్నానం చేశాడు. సంకల్పం చెప్పిన బ్రాహ్మణుడికి ఒక కాసు దక్షిణగా ఇచ్చాడు. రెండవకాసుతో అరటిపళ్ళు, ఖర్జూరపు పళ్ళు, గంధం కొని ఆలయంలోకి వెళ్ళి పండరీనాథుని దర్శించి తను తెచ్చిన వస్తువులు సమర్పించి బయటకు వచ్చి ధ్వజస్థంభం దగ్గర కూర్చుని రాత్రి నాలుగు జాములు వరకు హరికీర్తన చేసి జాగరణ చేశాడు. ఆరోజు ఉపవాసం చేసి మరునాడు స్నానానుష్ఠానాదులు తీర్చుకొని తన దగ్గర మిగిలిన మూడవ కాసుతో పిండి తీసుకుని చంద్రభాగా నది ఒడ్డున కూర్చుని ఇలా అనుకున్నాడు.

-సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD